
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు



మంగళవారం 22 అక్టోబరు 2024



ఇంకా పూర్తికాని రాయచోటి-రాజంపేట డబుల్ లేన్ రోడ్డు

ఘాట్ ప్రమాదం..


జిల్లా కేంద్రానికి ప్రధానమైన రహదారి అది.. చుట్టూ కొండలు, లోయలు.. మధ్యలో బాహుదా నది చూపరులను ఆట్టే ఆకట్టుకునే ప్రకృతి అందాలు ఆ మార్గంలో ఉన్నాయి. కానీ రహదారి మాత్రం మృత్యువుకు మార్గంగా ఉంది. అడుగడుగునా గుంతలు, చిన్న రోడ్డులో భారీ మలుపులతో ప్రమాదకరంగా మారింది. జిల్లా కేంద్రమైన రాయచోటికి రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల ప్రజలు ఏదో ఒక పనిమీద నిత్యం వెళుతుంటారు. అంతేకాకుండా ఇటీవల బాలరాజు పల్లెలో ఇసుక క్వారీ ఏర్పాటు చేయడం వల్ల నిత్యం టిప్పర్లు భారీగా ఈ మార్గంలో ప్రయాణిస్తున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కూడా ఆ మార్గం గుండానే వెళుతుంటారు. కానీ ఎవరూ కూడా ఆ రోడ్డును వెడల్పు చేయాలని, మరమ్మతులు చేయాలని ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వంలోని పెద్దలు స్పందించి ఈ రోడ్డును వెడల్పు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



సానిపాయి అటవీమార్గం దిగువన పూర్తిగా పాడైన రోడ్డు



పూర్తిగా పాడైపోయిన రాయచోటి-రాజంపేట ఘాట్ రోడ్డు



సానిపాయి నుంచి రాయచోటి వరకు పూర్తిగా దెబ్బతిన్న రోడ్డు

- వామ్మో.. ఆ ఘాట్ రోడ్డులో ప్రయాణమా..!
- అడుగడుగునా లోయలు.. గుంతలు.. పెద్దపెద్ద బండరాళ్లు
- భారీ మలుపుల వద్ద పాడైన రోడ్డు
- రెండు వాహనాలు ఎదురైతే పొంచి ఉన్న ప్రమాదం
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం
- రాయచోటి, రాజంపేట, కోడూరు నియోజకవర్గ ప్రజలకు ఇదే ప్రధాన మార్గం
- కనీసం గుంతలు పూడ్చి వెడల్పు చేయని అధికారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- ఇదీ రాయచోటి-రాజంపేట ఘాట్ రోడ్డు దుస్థితి

రాజంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మూడు ప్రధాన నియోజకవర్గాలకు రాజంపేట-రాయచోటి ఘాట్ రోడ్డే ప్రధానమైనది. మూడేళ్ల కిందట ఈ రోడ్డు గురించి పెద్దగా ఎవరూ పట్టించుకునేవారు కారు. గత వైసీపీ ప్రభుత్వం రాయచోటిని జిల్లా కేంద్రం చేయడంతో ఈ ఘాట్ రోడ్డు ప్రాధాన్యత సంతరించుకుంది. ఘాట్‌రోడ్డు అవతల జిల్లా కేంద్రం రాయచోటి ఉండడం, ఇటువైపు ఘాట్‌రోడ్డు పక్కనే రెవెన్యూ డివిజనల్ కేంద్రమైన రాజంపేట ఉండడం, మరోవైపు ఉద్యానవనాలకు, ఖనిజ సంపదకు పెట్టింది పేరైన రైల్వేకోడూరు నియోజకవర్గం ఉండడం, వీరందరూ అటు జిల్లా కేంద్రానికి, ఇటు డివిజన్ కేంద్రాలకు వస్తూ పోతుండడం వల్ల ఈ రోడ్డుకు ప్రాధాన్యత లభించింది. అన్నింటికి మించి ఈ ఘాట్ రోడ్డు బెంగళూరు ప్రధాన నగరానికి, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, కదిరి ప్రాంతాలకు ఇదే ప్రధాన రహదారి. నిత్యం వందల వాహనాలు ఈ మార్గం గుండానే వెళుతుంటాయి. రాజంపేట నుంచి రాయచోటికి వెళ్లే ఈ ఘాట్ రోడ్డు సుమారు 58 కిలోమీటర్లు దూరం ఉంటుంది. ఇది అటవీ మార్గం పూర్తిగా ఘాట్ రోడ్డుతో కూడుకున్నది. రెండు ఎంతో ప్రమాదకర మలుపులు ఉండే రెండు ప్రధాన అటవీ మార్గాలు ఈ మార్గంలో ఉన్నాయి. బాహుదా నది కూడా ఈ మార్గం గుండానే వెళుతుంది. 11 మండలాల ప్రజలకు నిత్యం ఈ రోడ్డు మార్గం ఎంతో కీలకమైంది. అటువంటి రోడ్డు మార్గంలో రాజంపేట నుంచి పాలెం వరకు తప్ప మిగిలిన ఘాట్‌రోడ్డు అంతా ఎంతో ప్రమాదకరమైంది. ఈ మార్గంలో అవసరమైన చోట ఏమాత్రం డబుల్ రోడ్డు పనులు పూర్తి చేయలేదు. ఎక్కడైతే రోడ్డు వెడల్పుగా ఉండాలో ఎక్కడైతే ప్రమాదాలు జరిగే మలుపులు ఉన్నాయో అక్కడే మృత్యులోగిల్లుగా పెద్ద పెద్ద గుంతలున్నాయి. రోడ్డుకు అటు ఇటు పెద్ద పెద్ద రాళ్లు అడ్డంగా ఉన్నాయి. ఎదురుగా ఏదైన వాహనం వస్తే మరో వాహనం గుంతల్లో పెద్ద పెద్ద గుండీసురాళ్లను దాటుకుంటూ మలుపురోడ్లల్లో అటవీ మార్గంలో ప్రయాణం సాగించాల్సి ఉంటుంది.

బాలరాజుపల్లెలో ఇసుక క్వారీ ఉండడం వల్ల ఈ ఇసుకను జిల్లావ్యాప్తంగా గృహనిర్మాణాలకు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఇసుకను తరలించడానికి పెద్ద పెద్ద టిప్పర్లు, ట్రాక్టర్లు ఇదే మార్గంలో రెండు నెలలుగా వెళుతున్నాయి. ఈ పెద్ద పెద్ద ఇసుక లారీలకు కార్లు అడ్డొస్తే అంతే సంగతి. ఇక ద్విచక్ర వాహనాలైతే వారి బాధలు వర్ణనాతీతం. కచ్చితంగా ద్విచక్ర వాహనదారులు సింగిల్‌రోడ్డు దిగి పెద్ద పెద్ద గుంతలను, రాళ్లను దాటుతూ వెళ్లాలి. దీనివల్ల అనేకమంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఘాట్ రోడ్డుకు దిగువ మార్గంలో రోడ్డు పూర్తిగా పాడై ఉంది. ప్రధానంగా సానిపాయికి సమీపంలోని అటవీ ప్రాంతంలో కొండ దిగువన పూర్తిగా రోడ్డు దెబ్బతింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. భారీ వర్షాలకు అటవీమార్గంలో ఉన్న రోడ్లపై వర్షపు నీటితో పెద్ద పెద్ద గుండీసురాళ్లు రోడ్డుకు అడ్డంగా పడగా వాటిని తొలగించేవారు లేక బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు దిగి వాటన్నింటిని తొలగించారు. ఇక సానిపాయి నుంచి రాయచోటి వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర రోడ్డును వెడల్పు చేయలేదు. డబుల్ రోడ్డుకు ఏర్పాటు చేసినా ఆ రోడ్డును పూర్తి చేయలేదు. అటు ఇటు కంపచెట్లు తొలగించి డబుల్ రోడ్డు ఏర్పాటుకు కంకర వేసినా తారురోడ్డు మాత్రం పూర్తి వేయలేదు. దీనివల్ల సానిపాయి నుంచి రాయచోటి వరకు రోడ్డు పూర్తిగా పాడై 58 కిలోమీటర్ల రోడ్డులో 20 కిలోమీటర్లు మినహా 30 కిలోమీటర్ల రోడ్డు అంతా పాడైంది. నిత్యం ఈ మార్గంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా కేంద్రమైన రాయచోటికి అధికారులతో పాటు అనేక మంది ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం పోతుంటారు. ప్రధానంగా బెంగళూరు నగరానికి అనేకమంది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు, అక్కడ నివాసం ఉన్నవారు, వ్యాపారులు ఇదే మార్గం గుండా వెళుతూ ఉంటారు. రాత్రివేళల్లో ఈ ఘాట్‌రోడ్డులో వెళ్లాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాహనాలు నడపాల్సి వస్తోంది. దీనిపై కలెక్టర్, జిల్లా ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి పాడైన ఈ ఘాట్ రోడ్డు మార్గాన్ని పరిశీలించి బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి..

జిల్లా కేంద్రమైన రాయచోటికి రాజంపేట, కోడూరు ప్రాంతాల నుంచి వెళ్లే ఈ ఘాట్‌రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారి అంతా అటవీమార్గంలో భారీ మలుపులతో కూడుకుంది. అటువంటి మలుపుల వద్ద రోడ్డు గుంతలమయమై ఉంది. అక్కడ గుంతలను పూడ్చి తారురోడ్డు వేయకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి రోజూ వందలాది వాహనాలు తిరిగే ఈ ప్రాంతంలో కనీసం రోడ్డు కూడా పూర్తి చేయలేని దుస్థితిలో ఉండడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న శాపం.

- సంభావు వినయ్‌కుమార్‌రాయల్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, రాజంపేట



జిల్లా కేంద్రానికి కనీసం రోడ్డు కూడా పూర్తి చేయరా!

జిల్లా కేంద్రమైన రాయచోటికి రాజంపేట, కోడూరు వాసులు వెళ్లే రాజంపేట-రాయచోటి ఘాట్‌రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయకపోవడం దారుణం. డబుల్ రోడ్డుకు అన్ని ఏర్పాట్లు చేశారు కానీ కొంతవరకు మాత్రమే రోడ్డు ఏర్పాటు చేశారు. ఎక్కడైతే రోడ్డు అవసరమో అక్కడ పూర్తి చేయలేదు. అటవీమార్గంలో మలుపుల వద్ద రోడ్డు వెడల్పు చేసి ప్రమాదాలు జరగకుండా తారురోడ్డు పూర్తి చేయాల్సి ఉండగా పూర్తి చేయలేదు. సానిపాయికి ఆనుకుని ఉన్న అటవీ దిగువ ప్రాంతంలో వరదనీటి వల్ల రోడ్డు అంతా పాడై కోసుకుపోయింది. అటు ఇటు 2 వాహనాలు ఎదురుపడితే ఇక అంతే సంగతులు వెంటనే ఈ రోడ్డు మార్గాన్ని పూర్తి చేయాలి.

- నందవరపు అజయ్‌బాబు, విశ్రాంత ప్రిన్సిపాల్ రాజంపేట



నరకానికి దారిగా రాయచోటి ఘాట్ రోడ్డు..

నరకానికి దారిగా రాయచోటి ఘాట్ రోడ్డు తయారైంది. ఒక డివిజన్ కేంద్రానికి, ఒక జిల్లా కేంద్రానికి, అనేక నియోజకవర్గ కేంద్రాలకు ఎంతో ప్రాధాన్యత గల ఈ రోడ్డును ఎప్పుడో 4 రోడ్లు చేయాల్సి ఉంది. కదిరి నుంచి నెల్లూరు జిల్లా కృష్ణపట్నం వరకు వెళ్లే ఈ రోడ్డు మార్గాన్ని నాలుగు లేన్ల జాతీయ రహదారిగా ఏర్పాటు చేస్తామని కేంద్రం ఎప్పుడో ప్రకటించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. కనీసం డబుల్‌రోడ్డు కూడా పూర్తి చేయలేదు. రాత్రివేళ అందునా ద్విచక్ర వాహనదారులు ఈ మార్గం గుండా వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. కొండలు, మలుపులతో ప్రమాదకరంగా ఉన్న ఈ రోడ్డుకు పాలకులు, అధికారులు మరమ్మతులు చేయాల్సి ఉంది.

- ఎస్వీ రమణ, విద్యావేత్త, రాజంపేట

రైతుపై అల్లరిమూక దాడి

- రైతు మల్లికార్జునకు గాయాలు
- మార్కెట్ యార్డులో ఉద్రిక్తత

గుర్రంకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ టమోటా మార్కెట్ యార్డుకు టమోటాలను తీసుకొచ్చిన రైతుపై అల్లరిమూక దాడి చేయడంతో ఓ రైతుకు రక్తగాయాలైన సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. రైతుల కథనం మేరకు మండలంలోని ఎల్లుట్ల గ్రామానికి చెందిన రైతు మల్లికార్జున (35) ట్రాక్టర్‌లో టమోటాలను మార్కెట్ యార్డుకు తీసుకొచ్చాడు. అప్పటికే మార్కెట్ యార్డు ట్రాక్టర్లు, లారీలు, ఆటోలతో నిండిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయంగా మారింది. ఈ క్రమంలో రైతు మల్లికార్జున మరో రైతు రమణ మధ్య దారి విషయమై వాగ్వాదం జరిగింది. ఈ ఇద్దరు రైతులు వాదించుకొంటుండగా పక్కనే ఉన్న అల్లరిమూక ఒక్కసారిగా వచ్చి రైతుపై దాడి చేయడంతో రక్త గాయాలయ్యాయి. విషయం గమనించిన రైతులు, ఎల్లుట్ల గ్రామస్థులు అక్కడకు చేరుకుని అల్లరిమూకపై తిరగబడ్డారు. దీంతో మార్కెట్ యార్డులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో అల్లరిమూక పారిపోగా అందులో ఓ యువకుడు మార్కెట్ యార్డులోని ఓ గదిలోకి వెళ్లి దాక్కున్నాడు. విషయాన్ని పోలీసులకు తెలపడంతో మార్కెట్‌యార్డుకు చేరుకుని రైతులకు సర్దిచెప్పారు. అనంతరం మార్కెట్‌యార్డు గదిలో ఉన్న యువకుడిని స్టేషన్‌కు తరలించారు. రైతుపై దాడికి పాల్పడిన అల్లరిమూకపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.



దాడిలో గాయపడిన రైతు మల్లికార్జున

అమరవీరులకు వందనం

- వారి ధైర్యం, అంకితభావాల వల్లే సురక్షితమైన సమాజం
- అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ శ్రీధర్

రాయచోటిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల ధైర్యం, నిబద్ధత, అంకితభావాలతోనే నేడు సురక్షితమైన సమాజం నిర్మించబడిందని, వారి త్యాగానికి సెల్యూట్ చేస్తున్నామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం జిల్లా పోలీసు పెరేడ్ మైదానంలో కలెక్టర్ సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరులైన పోలీసు వీరులకు కలెక్టర్‌తో పాటు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు సంస్మరణ దినోత్సవం కేవలం మనం కోల్పోయిన పోలీసులకు సంతాపం తెలిపే రోజు మాత్రమే కాదని, సమాజంలోని ప్రజలకు తమ ప్రాణాల కంటే ఎక్కువగా భద్రత కల్పించే వారి ధైర్యానికి, నిబద్ధతకు, అంకితభావానికి సెల్యూట్ చేసే రోజు కూడా అని కలెక్టర్ తెలిపారు. నిస్వార్థంగా ఉండడం, ఆపద వచ్చినప్పుడు ధైర్యంగా నిలబడడం, గౌరవంగా సేవ చేయడం అంటే ఏమిటో వారు మనకు చూపించారని, వారి నిర్విరామ కృషి వల్లనే మనం మన స్వేచ్ఛ, భద్రత, జీవన విధానాన్ని ఆస్వాదించగలుగుతున్నామని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. కొవిడ్-19పై పోరాడుతున్న సమయంలో పోలీసు వారు లేని సమాజాన్ని మనం ఊహించలేమని, ఆ సమయంలో వారు చేసిన నిర్విరామ కృషికి జోహార్లు తెలిపారు. 1999లో నక్సల్స్ చేతిలో హతమైన ఉమేశ్‌చంద్ర, ఐపీఎస్, గ్రేహౌండ్స్ ఫోర్సును ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించిన కేఎస్ వ్యాస్, 2008లో జరిగిన అటాక్‌లో, 2011లో జరిగిన ముంబై అటాక్స్‌లో ప్రాణాలు కోల్పోయిన అశోక్‌కాంటే లాంటి వాళ్ల చూపించిన ధైర్యసాహసాలు మరువలేనివన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మాట్లాడుతూ దేశ భద్రత కోసం పగలనక, రేయనక, విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుళ్లు, అధికారులు విధులను విజయవంతంగా నిర్వహించడంలో భాగంగా వారు తమ ప్రాణ త్యాగాలను, సేవలను మననం చేసుకోవడం మన కర్తవ్యం అన్నారు. ప్రస్తుత తరుణంలో పోలీసు వృత్తి ప్రాణాలతో చెలగాటం అని తెలిసి కూడా వాటిని లెక్కచేయకుండా ప్రజాసేవలో నిమగ్నం అవుతున్నామని తెలిపారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయి అమరులైన పోలీసులు అందరికీ జోహార్లు తెలిపారు. అనంతరం పోలీసు అమరవీరుల కుటుంబాలకు కుట్టుమిషన్లు, సైకిళ్లు తదితర వస్తువులను కలెక్టర్, ఎస్పీ అందించారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, రాయచోటి ఆర్డీవో రంగస్వామి, ఏఆర్ డీఎస్పీ చిన్నిక్రిష్ణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లె డీఎస్పీలు కృష్ణమోహన్, సుధాకర్ , కొండయ్యనాయుడు, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు అమరవీరులకు ఘన నివాళులర్పించారు.



అమరవీరుల స్థూపానికి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

దేశ భద్రతకు సీఆర్పీఎఫ్ పునరంకితం

- డీఐజీ అనుపమ్ శర్మ



కలికిరి సీఆర్పీఎఫ్ ప్రాంగణంలో ప్రసంగిస్తున్న డీఐజీ అనుపమ్ శర్మ

కలికిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో అంతర్గత భద్రతకు ముప్పు వాటిల్లకుండా సీఆర్పీఎఫ్ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని, దేశ ప్రజల క్షేమం కోసం పునరంకితమవుతుందని కలికిరి సీఆర్పీఎఫ్ ఆధ్వర్యంలోని ఉగ్రవాద వ్యతిరేక, తీవ్రవాద నిరోధక శిక్షణశాల (సీఐఏటీ-3) డీఐజీ అనుపమ్ శర్మ తెలిపారు. సోమవారం సీఆర్పీఎఫ్ ప్రాంగణంలో సద్భావనా దివస్ పేరుతో జరిగిన పోలీసుల అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ సీఆర్పీఎఫ్ ఆవిర్భావ పూర్వాపరాలను గురించి వివరించారు. దీక్షా దక్షతలతో దేశవ్యాప్తంగా విస్తరించిన సీఆర్పీఎఫ్ ప్రస్తుతం కీలకపాత్ర పోషిస్తోందని అందుకు అనుగుణంగా అకుంఠిత శక్తి సామర్థ్యాలతో సీఆర్పీఎఫ్ దళాలు ముందుకు సాగాలని తెలిపారు. ఈ ఏడాది వివిధ దురదృష్టకర సంఘటనల్లో ప్రాణత్యాగాలు చేసిన సీఆర్పీఎఫ్ సాయుధ దళాల పేర్లను చదివి ఘనంగా నివాళులర్పించారు. ముందుగా ప్రాంగణంలోని క్వార్టర్ గార్డ్ వద్ద అమర వీరుల స్మారక చిహ్నానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సెకండ్ ఇన్ కమాండెంట్ కె.బి.కె.ఎస్.చౌదరి, డిప్యూటీ కమాండెంట్లు అమరనాథ యాదవ్, కె.జి.శివప్రసాద్, కె.వి.ప్రసాద్, జవాన్లు పాల్గొన్నారు.

వెంటాడిన మృత్యువు

- అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తూ నలుగురు అనంతలోకాలకు..
- మృతుల్లో అత్త, అల్లుళ్లు
- దూదేకులపల్లెలో విషాద ఛాయలు



మృతదేహాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

కలకడ/పీలేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మృత్యువాత పడ్డ ఓ సమీప బంధువు అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఓ కుటుంబాన్ని మృత్యువు వెంటాడింది. అంత్యక్రియల్లో పాల్గొని స్వగ్రామాలకు తిరిగి వస్తున్న వారిని రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఒకే కుటుంబంలోని నలుగురిని పొట్టన బెట్టుకోవడమే కాకుండా మరో నలుగురిని తీవ్ర గాయాలు పాలుజేసింది. హృదయ విదారక ఈ సంఘటన సోమవారం రాత్రి కలకడ వద్ద జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది ప్రయాణిస్తున్న ఆటోను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కలికిరి మండలం టి.సండ్రావారిపల్లె(సొరకాయలపేట) పంచాయతీ దూదేకులపల్లెకు చెందిన బుజ్జమ్మ, ఎహసానుల్లా సమీప బంధువు ఒకావిడ సంబేపల్లె మండలం రాతిగుంట పంచాయతీ వంగిమళ్లవారిపల్లెలో సోమవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బుజ్జమ్మ, ఎహసానుల్లా, వారి కూతుళ్లు, అల్లుళ్లు వంగిమళ్లవారిపల్లెలో సోమవారం సాయంత్రం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని ఒకే ఆటోలో దూదేకులపల్లెకు తిరుగు ముఖం పట్టారు. కలకడ శివార్లలోని ఇందిరమ్మ కాలనీ వద్దకు రాగానే రాత్రి 9.45 గంటలకు ఎదురుగా వస్తున్న చిత్తూరు నుంచి హైదరాబాదుకు వెళుతున్న సీఎంఆర్ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఢీకొంది. తన ముందు వెళుతున్న వాహనాన్ని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో బుజ్జమ్మ (55), ఆమె అల్లుళ్లు ఖాదర్‌వలీ (30), నూరుల్లా (35), ఆమె వియ్యంకురాలు ఫకీరాబీ (60) అక్కడికక్కడే మృతి చెందారు. బుజ్జమ్మ భర్త ఎహసానుల్లా(60), ఆమె కుమార్తె దిల్‌షాద్ (25), దిల్‌షాద్ కుమార్తె సారా (4), వారి బంధువు అమ్మాజీ (26) తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాద సమాచారం అందిన వెంటనే కలకడ సీఐ గురునాథ్, ఎస్ఐ రామాంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. వారి బంధువులకు సమాచారం అందించారు. గాయపడ్డ వారిని 108 అంబులెన్సులో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వారికి పీలేరు ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. ప్రమాదం గురించి తెలుసుకున్న దూదేకులపల్లె గ్రామస్తులు పీలేరు ఆసుపత్రికి చేరుకున్నారు. క్షతగాత్రుల పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కలకడ పోలీసులు కేసు విచారిస్తున్నారు.



ప్రమాద స్థలంలో ఆటో, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు









గాయపడినవారికి వైద్యం చేస్తున్న దృశ్యం

కాల్పుల కేసులో షికారిపాళెం వాసులు

రాయచోటి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆదివారం జరిగిన కాల్పుల కేసులో వీరబల్లి మండలం షికారిపాళెంకు చెందిన నలుగురు నిందితులు ఉన్నట్లు సమాచారం. సంఘటనా స్థలంలోనే సత్యసాయి జిల్లా పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకోగా, మిగిలిన ముగ్గురు పరారైనట్లు సమాచారం. షికారిపాళెంకు చెందిన నలుగురు వ్యక్తులు నకిలీ బంగారాన్ని తెలంగాణాకు చెందిన కొందరికి అమ్మే ప్రయత్నం చేశారు. అది నకిలీ బంగారమని ముందుగానే గుర్తించిన తెలంగాణ వాసులు అక్కడి సైబర్ క్రైం పోలీసులతో సహా శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం ప్రాంతానికి వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నకిలీ బంగారాన్ని అమ్మేందుకు యత్నించిన షికారిపాళెం వాసులపై ఎయిర్‌గన్‌తో తెలంగాణ వాసులు కాల్పులు జరిపారు. దీంతో ముగ్గురు పారిపోగా షికారుపాళెంకు చెందిన ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. ఈ కేసును ప్రస్తుతం పుట్టపర్తి పోలీసులు విచారిస్తున్నారు.

చిరుద్యోగుల కడుపు కొట్టొద్దు

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో వలంటీర్లు



కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న వలంటీర్లు

రాయచోటిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చిరుద్యోగుల కడుపు కొట్టొద్దని, ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లకు రూ.10 వేల గౌరవం వేతనం ఇచ్చి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్, అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, వలంటీర్ల అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.మహేశ్, అఖిల భారత యువజన సమాఖ్య అధ్యక్షుడు టి.వెంకటేశ్‌లు మాట్లాడుతూ నాలుగు నెలల నుంచి గౌరవ వేతనం లేక అనేక మంది వలంటీర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఈ పరిస్థితుల్లో వెంటనే వలంటీర్లను కొనసాగించి తక్షణమే పది వేల రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి పలు సంఘాల నాయకులు మద్దతు ఇవ్వగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వలంటీర్లు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం కడపలోని పోలీసు పెరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు అమరుల కుటుంబాలకు బహుమతులు అందజేస్తున్న జడ్జి, ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ తదితరులు



ఏఎస్ఐ నాగార్జునరెడ్డి కుటుంబానికి బహుమతి అందచేస్తున్న ఆరవ అదనపు జడ్జి ఇంతియాజ్ అహ్మద్, ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటసుబ్బయ్య, అప్సర్ అహ్మద్ కుటుంబాలకు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి.నాగేశ్వరరావు, ఏఆర్ ఎస్ఐ డి.మల్లికార్జున, ఏఆర్ కానిస్టేబుళ్లు ఆర్.క్రిష్ణయ్య, విజయకుమార్, సురేష్ కుటుంబాలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



ఎస్ఐ ఎస్‌డీ జాకీర్‌హుస్సేన్ కుటుంబానికి కుట్టుమిషన్, హెడ్ కానిస్టేబుల్ ఎన్‌వీ అమర్‌నాథ్ కుటుంబానికి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబానికి, ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుటుంబానికి, ఏఆర్ కానిస్టేబుల్ వేదవతి కుటుంబంలో చిన్నారికి సైకిల్, కానిస్టేబుల్ మల్లికార్జున కుటుంబానికి బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, తదితరులు

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం రాయచోటి పోలీసు పెరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు అమరుల కుటుంబాలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపొద్దు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

రాయచోటి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్‌వో సత్యనారాయణరావు, ఆర్డీవో రంగస్వామి, ఎస్డీసీ రామసుబ్బయ్యలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందించిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంపై ప్రభుత్వం చాలా దృష్టి పెడుతోందని, సీఎం కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రీవెన్స్‌ను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో మండల, డివిజన్ ప్రధాన కేంద్రాల్లో కూడా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను పకడ్బందీగా నిర్వహించి చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి నేరుగా ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలపై ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని వారు జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య



గంగులమ్మ (ఫైల్‌ఫొటో)

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనం, అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురైన మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లెలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, అమ్మ చెరువుమిట్టకు చెందిన గంగులమ్మ (48) నీరుగట్టు వారిపల్లెలో టమోటా మార్కెట్ యార్డులో దినసరి కూలీగా పనిచేస్తూ జీవిస్తోంది. తన కుమార్తె రమాకు వివాహం చేసింది. వారు విడిగా కాపురం ఉంటున్నారు. 30 ఏళ్ల క్రితం భర్త చనిపోయాడు. అనారోగ్యం, ఒంటరితనంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఆదివారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందింది. సోమవారం ఉదయం తన కుమార్తె రమా ఇంటివద్దకు వెళ్లి చూడగా ఉరివేసుకున్నట్లు గుర్తించి కేకలు వేసింది. వెంటనే స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేయడంతో వారు మృతదేహాన్ని శవ పంచనామా కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కురబలకోటకు చెందిన వాణి అనే మహిళపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడంతో పాటు రూ.3 లక్షలు డిమాండ్ చేసి ఇవ్వకుంటే చంపేస్తామంటూ బెదిరించిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె రూరల్ సీఐ రమేష్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కురబలకోటకు చెందిన వాణి అనే మహిళ చాలా మంది వద్ద డబ్బులు వసూలు చేస్తోందని, సోషల్ మీడియాలో సుజాతరాణి అనే మహిళ పోస్టులు చేస్తూ దుష్ప్రచారం చేసిందని, రూ.మూడు లక్షలు డిమాండ్ చేసిందని, లేకపోతే చంపేస్తామని బెదిరించినట్లు ముదివేడు పోలీసుస్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. విచారించిన పోలీసులు సుజాతరాణితో పాటు సహకరించిన మదనపల్లెకు చెందిన నాగమణి, కురబలకోటకు చెందిన దేవ, తిరుపతికి చెందిన లక్ష్మీకళ అలియాస్ చంద్రకళలపై కేసు నమోదు చేశారు. కాగా సుజాత రాణి, దేవలు పాతనేరస్థులని సీఐ చెప్పారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

రామసముద్రం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని నడింపల్లె పంచాయతీ కమతంపల్లెలోని రాగిమాను రచ్చ వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.8450 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుకను బొక్కేశారు..!



మల్లెల పంచాయతీ అంకిరెడ్డిపల్లె ఏటిలో డంపు చేసిన ఇసుక (ఫైల్ ఫొటో)



జెట్టివారిపల్లె సమీపంలో ఇసుకను అక్రమంగా డంప్ చేసిన దృశ్యం (ఫైల్ ఫొటో)

● జప్తు చేసిన ఇసుకపై కన్ను
● కోట్లు వెనకేసిన గత పాలకులు
● తప్పు చేసిన వారిపై చర్యలేవీ !
● ప్రత్యేక పోలీసు నిఘా ఉంచినా ప్రయోజనం నిల్
● రెవెన్యూ అధికారుల అండదండలే కారణమా ?
● చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధుల డిమాండ్

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇసుకను బొక్కేశారు. రూ.కోట్లు వెనకేసినా సంబంధిత అధికారులు అటువైపు చూడలేదంటే నమ్మశక్యం కాదు. పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమంగా తరలిస్తున్నా అటు పోలీసులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా ఇసుకను తరలించుకుని సొమ్ము చేసుకున్నారు. కానీ అధికారులు మాత్రం వారిపై కేసులు నమోదు చేయలేదనే విమర్శలున్నాయి. గత వైసీపీ పాలనలో మండలంలోని మల్లెల గ్రామంలోని సంపతికోట ఏటిలో గత 2022వ సంవత్సరంలో స్థానిక ప్రజాప్రతినిధి ప్రోద్బలంతో స్థానిక బూర్లపల్లె సర్పంచ్ ఆ ఏటిలో రాత్రికి రాత్రే భారీ యంత్రాలను ఉపయోగించి ఇసుకను భారీగా డంప్ చేశారు. ఈ విషయంపై పలు పత్రికల్లో వార్తలు రావడంతో డంప్ చేసిన ఇసుకను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపేసి స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. గత ప్రభుత్వం అధికారంలో ఉండగా టి.సదుం పంచాయతీ రామాపురం ఇసుక రీచ్ నుంచి అక్రమంగా తరలించి సుమారు 10 వేల టిప్పర్ల ఇసుకను 2024 ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే మొత్తం ఇసుకను రాత్రికి రాత్రే టిప్పర్లతో కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకున్నట్లు చెబుతున్నారు.

భారీగా కర్ణాటకకు ఎగుమతి

టి.సదుం పంచాయతీలో చెన్నరాయునిపల్లె సమీపంలో ఉన్న పాపాఘ్నినదిలో ఇసుక డంప్‌ను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఇసుకను అక్రమంగా రెవెన్యూ అధికారుల అండదండలతో రాత్రికి రాత్రే లారీల ద్వారా గుట్టు చప్పుడు కాకుండా కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకున్నారు. కనీసం గతంలో కర్ణాటక రాష్ట్రానికి ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డ ఇసుక లారీలను స్థానికులు పట్టించినా అధికారులు ఎమ్మెల్యే అండదండలతో ఆ లారీలను వదిలేసేవారని ఆరోపణలున్నాయి. దీంతో ఇసుక అక్రమ రవాణా గత ప్రభుత్వంలో అడ్డూ అదుపు లేకుండా పోయింది.

అధికారుల అండతో అమ్మేశారు

పెద్దతిప్పసముద్రం మండలం, మల్లెల గ్రామానికి సమీపంలోని అంకిరెడ్డిపల్లె, ఆవులరెడ్డిపల్లె సమీపంలో సంపతికోట ఏటి వాగు ఉంది. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సర్పంచ్ నియోజకవర్గ ప్రజాప్రతినిధి, రాజంపేట పార్లమెంట్ ప్రజాప్రతినిధి అండదండలతో ఏటిలో మొత్తం ఇసుకను యంత్రాల సహాయంతో భారీగా డంప్ చేసినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై స్థానిక నాయకులు అప్పట్లో లోకాయుక్తాకు సైతం ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన లోకాయుక్త ఆ ఇసుకపై ప్రత్యేక దృష్టి సారించి సీజ్ చేసిన ఇసుకపై తమకు నివేదికను అందించాలని కోరింది. అయితే లోకాయుక్తాను సైతం లెక్క చేయకుండా అప్పటి స్థానిక తహసీల్దార్ బూర్లపల్లె సర్పంచ్‌తో చేతులు కలిపి జప్తు చేసిన ఇసుకను పూర్తిగా అమ్మేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

జప్తు చేసిన ఇసుకపై స్థానికుల ఫిర్యాదు

గతంలో జప్తు చేసిన సుమారు 600 లోడ్ల ఇసుకను అమ్మేశారని బూర్లపల్లె గ్రామానికి చెందిన స్థానికులు రెవెన్యూ అధికారులకు, సబ్ కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినా ఇంతవరకు ప్రయోజనం లేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక వీఆర్వో, వీఆర్ఏల అండదండలతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ అవసరాలకు ఇచ్చామంటూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా జప్తు చేసిన ఇసుకను ప్రభుత్వ పనులకు వినియోగించారా లేక రెవెన్యూ అధికారుల అండదండలతో అమ్మేశారా అనే కోణంలో విచారణ చేపట్టి తప్పుచేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే అనుమతులిచ్చాం

- విద్యాసాగర్, డిప్యూటీ తహసీల్దార్

మండలంలో అప్పట్లో ప్రభుత్వ భవనాలకు అధికారుల ఆదేశాల మేరకే ఇసుకను కేటాయించాం. మండలంలో ఎవ్వరికి అనుమతులు లేకుండా ఇవ్వలేదు. ప్రభుత్వ పనులకు మాత్రమే ఇచ్చాం. అక్రమంగా ఇసుకను తరలించే వారిపై చర్యలు తీసుకున్నాం.



టి.సదుం పంచాయతీ రామాపురం ఇసుక రీచ్‌లో డంప్ చేసిన ఇసుకను టిప్పర్లతో తరలిస్తున్న దృశ్యం (ఫైల్)



మల్లెల పంచాయతీ అంకిరెడ్డిపల్లె ఏటిలో ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ పోలీసులు (ఫైల్)

హత్యకేసులో ముగ్గురు నిందితులు అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి): కురబలకోట డంపింగ్‌యార్డు వద్ద శనివారం జరిగిన హత్యకేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. సోమవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. గత 14 ఏళ్లుగా కురబలకోటకు చెందిన సులేమాన్ కువైత్‌లో డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. అతనికి ఉన్న పొలాలను చూసుకునేందుకు గానూ ఖాదర్‌బాషాను పనిలో పెట్టుకున్నాడు. ఇందుకు అతనికి నెలకు రూ.15 వేలు ఇచ్చేవాడు. అయితే సులేమాన్ ఇండియాలో లేని కారణంగా అతని భార్యకు హత్యకు గురైన ఖాదర్‌బాషకు అక్రమ సంబంధం ఉన్నట్లు గ్రామంలో పుకార్లు, షికార్లు చేశాయి. దీంతో సులేమాన్ 15 రోజుల క్రితం ఇండియాకు వచ్చాడు. తన పొలం పనులను చూసుకునేందుకు తన సమీప బంధువు కల్లూరు అబ్దుల్ రహీంను పనిలో పెట్టుకొని, ఖాదర్‌బాషను పనిలో నుంచి తొలగించాడు. దీంతో జీవనోపాధి కోల్పోవడంతో మృతుడు తీవ్ర ఆవేదన చెందాడు. ఈ నేపథ్యంలోనే అబ్దుల్ రహీంను, వారి కుటుంబ సభ్యులను మృతుడు కురబలకోట బస్టాండ్‌లో కించపర్చే విధంగా తిట్టాడని, బంధువర్గంలో పరువు మర్యాదలు కోల్పోతున్నామని భావించారు. ఈ క్రమంలో కురబలకోట మండలం, గడ్డంవీధికి చెందిన సులేమాన్, కోటవీధికి చెందిన అబ్దుల్ రహీంలు కుట్రపన్ని శుక్రవారం కురబలకోట గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌తో కలిసి మద్యం సేవించి హత్యకు పన్నాగం పన్నారు.

శుక్రవారం రాత్రి 7.45 సమయంలో ఖాదర్‌బాష ఇంటి వద్ద కాపుకాశారు. మసీదుకు తన తండ్రి వెంట వెళుతున్న ఖాదర్‌బాషను మాట్లాడే పనిఉందని అబ్దుల్‌రహీం, అరుణ్ కుమార్‌లు వారి ద్విచక్ర వాహనంపై ఎక్కించు కున్నారు. కురబలకోట డంపింగ్‌యార్డు వద్దకు తీసుకెళ్లి తాము తెచ్చుకున్న కత్తులతో గొంతుపై పొడిచి, అక్కడి నుంచి పారిపోయారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డురావడంతో కిందపడి ఇద్దరికి గాయాలయ్యాయి. కురబలకోట ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. సమాచారం తెలుసుకున్న మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు పర్యవేక్షణలో మదనపల్లె రూరల్ సీఐ రమేష్, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కురబలకోట మండలం, యర్రపల్లె పంచాయతీ, బాపనపల్లె వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని మదనపల్లె రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు చూపి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. వారు హత్యకు వాడిన రెండు కత్తులు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు 27 మంది ఎంపిక

కలికిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ మండలాల నుంచి జిల్లా స్థాయి పోటీల్లో 27 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో సోమవారం మహల్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో 15 మంది బాలురు, 12 మంది బాలికలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన బాలురు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. నవంబరు 6, 7 తేదీల్లో మొలకలచెరువు ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలు జరుగనున్నాయి.

బాలుర విభాగంలో

డి.లక్ష్మీనరసింహారెడ్డి, ఎం.హేమంత్, ఐ.భరత్, టి.దిలీప్, సి.చరణ్‌రాజ్, కె.పవన్, ఎస్.వెంకట్, యు.అఖిల్, కె.ఎస్.దర్శన్, జి.నాగమల్లేష్, వి.పార్థీవ్ రత్నం, ఎం.బాలాజీ, కె.రంజిత్, ఎస్.ఉమర్, పి.సతీష్, టి.హర్షవర్ధన్‌లు.

బాలికల విభాగంలో

ఇ.లక్ష్మి, బి.పూజిత, డి.శ్రీలక్ష్మి, ఎస్.లక్ష్మీప్రియ, ఎస్.వి.జూలీ, కె.నయనశ్రీ, ఎస్.తనుశ్రీ, జి.నీహారిక, ఎ.రేఖాశ్రీ, ఎస్.కల్పన, పి.యామిని, దేవీప్రియలున్నారు. పోటీల నిర్వహణలో మహల్ హెచ్‌ఎం ఎస్.చెంగ్రాలా యులు, స్కూల్ కమిటీ అధ్యక్షుడు నిజాముద్దీన్, జిల్లా గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వసంతమ్మ, సహాయ కార్యదర్శి నాగరాజ, మహల్ పీడీ ఎస్.రియాజ్ అహ్మద్, మాజీ సర్పంచు టీడీపీ నాయకుడు మహ్మద్‌అలీ, జిల్లాలోని పలువురు సీనియర్ పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

కలకడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భూతగాదా విషయంలో వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మండలంలోని బాటవారిపల్లె పంచాయతీ పెమినేనివాండ్లపల్లెకు చెందిన వెంకటరమణ అదే గ్రామానికి చెందిన మల్లికార్జునకు కొంతకాలంగా భూతగాదాలున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న వెంకటరమణపై మల్లికార్జున్, వరుణ్‌లు గాయపరిచినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గాలేరు-నగరి ఈఈ శ్రీనివాసులుకు పదోన్నతి

కలికిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గాలేరు నగరి సుజల స్రవంతి కడప సర్కిల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేస్తున్న కె.శ్రీనివాసులుకు పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన సూపరింటెండెంట్ ఇంజినీరుగా పదోన్నతి పొందారు. శ్రీనివాసులును జల వనరులశాఖ కడప సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీరుగా నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి జి.సాయి ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా టీవీ రమణ

కలికిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా కలికిరికి చెందిన టీవీ రమణను నియమించారు. ఈ మేరకు జాతీయ మాల మహానాడు మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.సి. కుసుమకుమారి సోమవారం రమణకు నియామకపత్రం అందజేశారు. గతంలో ఈయన జిల్లా కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఆయన సేవలను గుర్తించిన సంఘం జిల్లా పదవి అప్పగించింది. మాలల సంక్షేమం, అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తానని ఈ సందర్భంగా రమణ తెలియజేశారు.

కరోనా... ఏం మాయ చేసిందో..!



కొండాపురం రైల్వేస్టేషన్

- కళావిహీనంగా మారిన కొండాపురం రైల్వేస్టేషన్
- స్టాపింగ్‌కు నోచుకోని రైళ్లు
- గతంలో నడిచిన అన్ని రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలి
- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్
- ఆందోళనలు చేసినా.. పట్టించుకోని రైల్వేశాఖ

కొండాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారి ఏం మాయ చేసిందో ఏమో కానీ కొండాపురం రైల్వేస్టేషన్ కళావిహీనంగా మారింది. బ్రిటీష్ కాలం నుంచి ఓ వెలుగు వెలిగిన ఈ రైల్వేస్టేషన్ ప్రస్తుతం వెలవెలబోతోంది. గతంలో ఈ స్టేషన్ మీదుగా వెళ్లే దాదాపు 80 శాతం రైళ్లకు స్టాపింగ్ ఉండేది. కరోనా మొదలైనప్పటి నుంచి



రైళ్లు నిలుపుదల చేయాలంటూ ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాలు (ఫైల్‌ఫొటో)

రెండు రైళ్లు మినహా అన్ని రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేశారు.ప్రస్తుతం దర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, తిరుపతి-హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మాత్రమే స్టాపింగ్ ఉంది. గతంలో కొండాపురం స్టేషన్‌లో స్టాపింగ్ ఉన్న అన్ని రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేశారు.దీంతో కొండాపురంతో పాటు చుట్టు ప్రక్కల ఉన్న సింహాద్రిపురం, యల్లనూరు, తొండూరు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ రైళ్లు ఆగేదెప్పుడో...

కరోనా మహమ్మారి రాక ముందు హైదరాబాద్-తిరుపతి మధ్య నడిచే రాయలసీమ ఎక్స్‌ప్రెస్, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, చెన్నై-ముంబైల మధ్య నడిచే దాదర్ ఎక్స్‌ప్రెస్, మెయిల్ ఎక్స్‌ప్రెస్, కన్యాకుమారి-ముంబైల మధ్య నడిచే జయంతి ఎక్స్‌ప్రెస్‌లతో పాటు తిరుపతి-ముంబైల మధ్య నడిచే బాలాజీ ఎక్స్‌ప్రెస్‌లకు కొండాపురం రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఉండేది. వీటన్నంటిని పునరుద్ధరించాలని గతంలో వామపక్షాలు, ప్రజసంఘాలు ఆందోళన చేపట్టాయి. దీంతో కేవలం ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ను మాత్రమే ఆపుతున్నారు. అన్ని రైళ్లను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి గతంలో, ప్రస్తుతం కూడా లేఖ ఇచ్చారు. అయినా రైల్వేశాఖ నుంచి ఇంతవరకు స్పందన లేదు. వెంటనే అన్ని రైళ్లను పునరుద్దరించేలా ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వే మంత్రిని కలిసినా...



కొండాపురంలో రైళ్ల స్టాపింగ్ కోసం గతంలో ఎంపీగా ఉన్న రఘురామకృష్ణమరాజుతో కలిసి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు తాను రైల్వేబోర్డులో పలుసార్లు అధికారులను కలిసినా ఇంతవరకు రైల్వే అధికారులు స్పందిచడం లేదు. ప్రయాణీకుల సౌకర్యం చూడకుండా వారు ఏవేవో సాకులు చెబుతున్నారు. అయినప్పటికీ మరోసారి ఎమ్మెల్యేతో కలిసి రైల్వే అధికారులపై ఒత్తిడి తెచ్చి రైళ్లు ఆపేందుకు ప్రయత్నిస్తాం.

-దేవగుడి శివనారాయణరెడ్డి,
మాజీ జడ్ఆర్‌యూసీసీ మెంబర్

అన్నిరైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలి



గతంలో స్టాపింగ్ ఉన్న రైళ్లకు కొండాపురంలో స్టాపింగ్ ఎత్తివేశారు.నాలుగు మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవడంలేదు. మేం గతంలో నిరాహార దీక్ష చేపట్టడానికి సిద్ధం కావడంతో కేవలం ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును మాత్రమే ఆపుతున్నారు. గతంలో స్టాపింగ్ ఉన్న అన్ని రైళ్లకు తిరిగి కొండాపురం రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఇవ్వాలి. లేకుంటే మరోసారి ఆందోళనకు దిగుతాం.

-ఎం.మనోహర్‌బాబు,
సీపీఐ మండల కార్యదర్శి, కొండాపురం


కొండాపురం రైల్వేస్టేషన్‌లో తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు నీళ్లు నింపుతున్న దృశ్యం

నీళ్ల కోసం పేరెన్నిక గల స్టేషన్

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో కొండాపురం రైల్వేస్టేషన్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. కర్నూలు జిల్లా మంత్రాలయం తర్వాత కొండాపురం రైల్వేస్టేషన్‌లోనే రైళ్లకు నీళ్ల నింపేవారు. మంత్రాలయం దగ్గరలో తుంగభద్ర నది నుంచి రైళ్లకు నీళ్ల నింపుతుండగా, కొండా పురం పక్కనే ఉన్న చిత్రావతి నది నుంచి రైళ్లకు నీళ్ల నింపేవారు. ఇందుకోసం చిత్రావతి నది నుంచి ప్రత్యేక పైపులైనును కొండాపురం రైల్వేస్టేషన్‌కు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు మాత్రమే కొండాపురంలో నీళ్ల నింపుతున్నారు. ప్రతిరోజు విశాఖపట్నం-కడప మధ్య నడిచే ఈ రైలు కొండాపురం రైల్వేస్టేషన్‌కు కేవలం నీళ్ల నింపుకోవడానికే కడప నుంచి కొండాపురం వస్తుంది. రైల్వేస్టేషన్‌లో సుమారు నాలుగు గంటలు హోల్డింగ్ ఉంటుంది. ఈ సమయంలో ఈ రైలుకు క్లీనింగ్ చేయడంతో పాటు నీళ్ల నింపుతారు. ఈ తర్వాత మధ్యాహ్నం ఒంటి గంటకు కొండాపురం నుంచి విశాఖపట్నం బయలుదేరుతుంది. కొండాపురం నుంచే ఈ రైలు మొదలవుతున్నా స్టేషన్‌లో ఈ రైలుకు టికెట్లు ఇవ్వకపోవడం గమనార్హం. దీనిపై స్థానికులు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకుకెళ్లగా.. ఇందుకు స్పందించి రైల్వే అధికారులతో ఫోన్లో మాట్లాడారు. వెంటనే ఇక్కడినుంచే స్టాపింగ్, టికెట్లు ఇచ్చి ప్రయాణీకులను ఎక్కించుకోవాలని కోరినా ఇంతవరకు స్పందన లేదు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు


గంగనపల్లెలో మొలకలు వచ్చిన మినుము కుప్పలను పరిశీలిస్తున్న ఏవో జయలక్ష్మి

కాశినాయన, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో వరి, మినుము, మిరప, ఉల్లి తదితర పంటలు దెబ్బతిన్నాయి. దీనిపై సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఎడతెరిపిలేని వర్షం... దెబ్బతిన్న పంటలు అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం వివరాలను సమగ్రంగా పంపాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆమేరకు సోమవారం మండల వ్యవసాయాధికారి జయలక్ష్మి, విస్తరణాధికారి ధనలక్ష్మి గంగనపల్లె, ఇటుకులపాడు తదితర గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్ట నివారణకు రైతులకు సూచనలు ఇవ్వడంతో పాటు జరిగిన పంట నష్టంపై రెండు రోజుల్లో జిల్లా అధికారులకు నివేదిక పంపుతామన్నారు.

ఏపీ డీజీపీని కలిసిన వేమన సతీష్



రాజంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్ విజయవాడ డీజీపీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో అవినీతి అక్రమాలపై, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. ఇంకా పలు సమ స్యలపై ఆయనతో చర్చించారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా విజయకుమార్, మహేశ్‌బాబు


విజయకుమార్, మహేశ్‌బాబు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా విజయకుమార్, మహేశ్ బాబులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన స్వర్ణోత్సవాల సభ అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా నాగార్జునరెడ్డి, సహాయ అధ్యక్షుడిగా వై.రవికుమార్, సుజాతారాణి ట్రెజరర్‌గా కె.నరసింహారావు, కార్యదర్శులుగా శ్రీనివాసులు, డీవీ రవీంద్రుడు, చెన్నయ్య, సీవీ రమణ, ఎజాజ్ అహ్మద్, మురళీక్రిష్ణ, ఎల్.చంద్ర ఓబుల్‌రెడ్డి, ఎ.శ్రీనివాసులు, ప్రసన్నలక్ష్మి, టి.శివప్రసాద్‌లను ఎంపిక చేశారు.

పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడిగా క్రిష్ణప్రసాద్


ఎంవీక్రిష్ణప్రసాద్, రామాంజనేయరెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా ఎంవీ క్రిష్ణప్రసాద్, జిల్లా కార్యదర్శి రామాంజనేయరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటశివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరం పీఆర్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశామన్నారు. ఈ ఎంపిక పట్ల పీఆర్‌టీయూ నాయకులు వెంకటసుబ్బారెడ్డి, శ్రీనివాసులు, రామ్మూర్తి, కె.శ్రీనివాసులు, నరసింహులు, ఆంజనేయులు, బాబురెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



పెండ్లిమర్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొలతల ఘాట్‌రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎ.మిథున్‌రెడ్డి (27) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకెళితే.... మండలంలోని మాచునూరు పంచాయతీ కొత్తపేట గ్రామానికి చెందిన మిథున్‌రెడ్డి పొలతల క్షేత్రంలో దైవ దర్శనం ముగించుకొని ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా ముందు వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ని ఓవర్ టేక్ చేసి ముందుకువెళ్లిన వెంటనే బైక్ అదుపు తప్పడంతో ట్రాక్టర్ కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

కడప క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎర్రముక్కపల్లిలోని కందిపాలెంలో సోమవారం ఓ వృద్ధుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఒన్‌టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. కందిపాలెంకు చెందిన నంద్యాల కృష్ణ (62) బెల్దారి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. ఇంట్లో ఒంటరిగా ఉండేవాడు. సోమవారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం కొరకు మృతదేహన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో దుండగులు..?

కడప క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కడప నగర అధ్యక్షుడు శివాకొండారెడ్డిపై దాడి చేసిన దుండుగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మూడు రోజుల క్రితం టీ తాగి ఇంటికి వెలుతున్న అయనపై యువకులు కర్రలతో కొట్టి ద్విచక్ర వాహనంలో పారిపోయారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అదుపులో ఉన్న వారిలో ఒకరిపై రౌడీషీట్ ఉన్నట్లు తెలుస్తోంది. శివకొండారెడ్డిపై దాడికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంటుంది

హెయిర్ కటింగ్ సెలూన్లపై రాళ్లదాడి

రాయచోటిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గల సెలూన్ షాప్‌లపై గుర్తు తెలియని దుండగులు రాళ్లతో దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు. రాయచోటి పట్టణంలోని చెక్‌పోస్టు సమీపంలో గల రవి హెయిర్ కటింగ్ సెలూన్‌కు చెందిన రవికిశోర్‌రెడ్డి, ప్రసాద్, తులసీ, ప్రసన్నకుమార్‌లు ఆదివారం రాత్రి మద్యం మత్తులో తమ వ్యాపారాలకు అడ్డుగా వస్తున్నారన్న కోపంతో చీఫ్ అండ్ బెస్ట్ సెలూన్ షాప్, టాయ్ అండ్ గాయ్ సెలూన్‌షాప్‌లపై వాహనంలో వెళ్లి రాళ్లదాడి చేసి అక్కడ నుంచి చల్లగా జారుకున్నారు. ఈ దాడిలో షాప్‌లోని అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని షాప్‌లోనే సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలియజేశారు.

దళితులపై అగ్రవర్ణాల దాడి.. ఎస్సీ ఎస్టీ కేసు

ఓబులవారిపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్లపల్లె కమ్మపల్లె హరిజనవాడ దళితులపై కాకర్లవారిపల్లెకు చెందిన అగ్రవర్ణాలవారు దాడికి పాల్పడటంతో ఎస్సీ ఎస్టీ యాక్టు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహే ష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను సొంతం చేసుకునేందుకు అగ్రవర్ణాలవారు ప్రయత్నించగా అడ్డుకోవడానికి వెళ్లిన దళితులపై దాడి చేసినట్లు తెలిపారు. పి.కమ్మపల్లె గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా.. అడ్డుకో వడానికి యత్నించిన హరిజావాడకు చెందిన పి.కృష్ణయ్య, మరో వ్యక్తిపై కర్రలతో దాడి చేశారు. కాగా వీరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. దాడికి పాల్పడిన కాకర్లవారిపల్లెకు చెందిన కస్తూరి వెంకటేశ్వర్ నాయుడు, శివయ్య నాయుడు, కోటయ్యనాయుడు, ఉమా, మరొకరిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప(వినాయకనగర్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు 2024-25కు సంబంధించి ఈ నెల 30వ తేదీ లోపు ఆయా కళాశాలల జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు దరఖాస్తులను సాంఘీక సంక్షేమశాఖ కడప వారికి ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. కళాశాలలో చదువుతున్న ఎస్సీ విద్యార్థులందరూ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఐపీపీబీ ఖాతాను పోస్టాఫీసులో తెరవాలని కోరారు. పోస్టుమెన్ సహకారంతో ఆయా కళాశాలల్లో ఐపీపీబీ క్యాంపు నిర్వహించాలన్నారు. ఎస్సీ విద్యార్థులకు ఆధార్‌కార్డు, సెల్ నెంబర్ అవసరం ఉంటుందన్నారు. ఎన్‌పీసీఐ ద్వారా స్కాలర్‌షిప్‌లు నేరుగా అకౌంట్‌లో జమ అవుతాయన్నారు. నగదును తీసుకోవడానికి పోస్టాఫీసు ద్వారా కానీ, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా కానీ అవకాశం ఉంటుందని తెలిపారు.

జవాను రాజేశ్‌కు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు


అంత్యక్రియల సందర్భంగా గాలిలోకి తుపాకీ పేల్చి జవానుల గౌరవవందనం

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్‌లోని నక్సల్స్ అమర్చిన ల్యాండ్‌మైన్ పేలి మృతి చెందిన జవాను కొడవటికంటి రాజేశ్‌కు సోమవారం ఆర్మీ సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జవాను రాజేశ్ ఇంటి నుంచి అంతిమయాత్ర ప్రారంభం కాగా.. దారి పొడవునా రాజేశ్ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. గ్రామ శ్మశానవాటిక వద్దకు చేరుకోగా.. రాజేశ్ భార్య స్వాతి. తల్లిదండ్రులు జానయ్య బాలమ్మ పలువురు కుటుంబసభ్యులు భౌతికకాయం వద్ద బోరున విలపించగా అందరూ కంటి తడిపెట్టారు. ఇండో టిబెటన్ బోర్డరు పోలీసులు, ఐటీబీపీఎస్ఎఫ్ సిబ్బంది అంత్యక్రియలకు హాజరై రాజేశ్‌ను కడసారి చూసి నివాళు ర్పిం చారు. అనంతరం గౌరవ వందనం చేసి సంతాపం సూచకంగా గాలిలో కాల్పులు జరిపి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు అడిషనల్ అసిస్టెంటు కమాం డెంట్ దితేంద్రసింగ్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, బ్రహ్మంగారి మఠం ఎస్ఐ చంద్రశేఖర్, ఎంపీడీవో వెంగమునిరెడ్డి, తహ సీల్దారు దామోదర్‌రెడ్డి, బద్వేలు డివిజను ఆర్డీవో చంద్రమోహన్, గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని రాజేశ్‌కు నివాళులర్పించారు. రాజేశ్ భౌతికకా యానికి ఉదయం కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీమంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు వీరనారాయణరెడ్డి, టీడీపీ నేతలు యల్లటూరు సాంబశివారెడ్డి, మేకల సుధాకర్, చిలమల నాగయ్య, ఎస్ఆర్ శ్రీనివాసరెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, పూజా శివాయాదవ్ తదితరులు సంద ర్శించి రాజేశ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జన్ సురక్ష పథకాలపై అవగాహన పెంచాలి : కలెక్టర్


మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో జన్ సురక్ష పథకాల (పీఎంజేబీబీవై, పీఎం ఎస్‌బీవై)పై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో ప్రత్యేక జిల్లాస్థాయి (డీఎల్ఆర్‌సీ) సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అన్ని బ్యాంకులకు నిర్ధేశించిన జన్‌సురక్ష పథకాలపై అవగాహన, అమలుపై బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి వచ్చే ఏడాది జనవరి 15 వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో విస్తృత ప్రచారాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పనిచేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత ధృడంగా ఉంటుందన్నారు. జన్‌సురక్ష బీమా యోజన పథకాల నమోదు కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలన్నారు. ఈపథకా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు సంతృప్తిస్థాయిలో అర్థమయ్యేలా అవగాహన పెంచాలన్నారు. ప్రభుత్వాలు పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అన్ని రకాల బ్యాంకు రుణాలను అర్హులైన లబ్ధిదారులకు పెండింగ్ లేకుండా అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజరు జనార్ధన్, డీపీవో రాజ్యలక్ష్మి, డీఆర్డీఏపీడీ ఆనంద్ నా యక్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేసు విచారణ కోసం వచ్చిన వ్యక్తి మృతి

- స్టేషన్ ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన



స్టేషన్ ఎదుట దేవరాజు మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

సంబేపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలం కొండావాండ్లపల్లికి చెందిన దేవరాజు (60) సోమవారం కేసు విచారణ కోసం వచ్చి ఒక్కసారిగా ఛాతి నొప్పి రావడంతో కుప్ప కూలి పడిపోయాడు. అతడిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిరారించారు. ఈ సంఘటనపై మృతుని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ సంబేపల్లె పోలీస్ స్టేషన్ ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. రాయచోటి రూరల్ సీఐ సంఘటన విషయాన్ని తెలుసుకొని హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. దేవరాజు కుమార్తె జ్యోతి ఆడబిడ్డ అంజనమ్మ పోలీసు స్టేషన్‌లో బంగారు విషయంపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణకు పిలిపించినట్లు తెలిపారు. అతను హార్ట్ పేషెంట్ కావడంతో ఛాతి నొప్పి వచ్చినట్లు మృతుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ విషయంపై స్టేషన్‌లో జరిగిన విచారణ సంఘటనపై సీసీ ఫుటేజులను ఒకసారి పరిశీలించమని రూరల్ సీఐ వరప్రసాద్ మృతుని కుటుంబ సభ్యులను కోరారు. మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన విరమించకపోవడంతో ఈ లోపే రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ సంబేపల్లెకు చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి సీసీ ఫుటేజీలను పరిశీలించాలని కోరారు. దీంతో కుటుంబ సభ్యులు సీసీ ఫుటేజిలను పరిశీలించి ఆందోళన విరమించారు. ఫిర్యాదు చేసిన వారి నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని.. తమకు ఏమి జరిగినా వారిదే బాధ్యత అని డీఎస్పీ ఎదుట మృతుని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ విషయంపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించి మృతదేహాన్ని తీసుకెళ్లారు.

ఛాతి నొప్పితోనే మృతి చెందాడు : డీఎస్పీ

సంబేపల్లె మండలం దుద్యాల గ్రామానికి చెందిన అంజనమ్మ బంగారు విషయంపై ఫిర్యాదు మేరకు దేవరాజును స్టేషన్‌కు పిలిపించారు. అతడికి ఛాతినొప్పి రావడంతో రాయచోటి ఆసుపత్రికి తరలించగా.. గుండె నొప్పితో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. స్టేషన్‌లో జరిగిన సీసీ ఫుటేజి మృతుని కుటుంబ సభ్యులకు చూపించడంతో వారు శాంతించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లారని డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు.

పసుపులేటి శంకర్‌కు ఆంధ్రరత్న పురస్కారం

ఒంటిమిట్ట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషాభివృద్ధితోపాటు, వ్యక్తిత్వ వికాసం, జాతీయ సమైక్యత తదితర అంశాలపై ఉపన్యాసాలతో విద్యార్థుల్లో ప్రేరణ కలిగించిన ఒంటిమిట్ట పోతన సాహిత్యపీఠం అధ్యక్షుడు, హిందూ టెంపుల్ ప్రేయర్ సొసైటీ జాతీయ చైర్మన్ డాక్టర్ పసుపులేటి శంకర్ సోమవారం విజయవాడలో ఆంధ్ర రత్న గౌరవ పురస్కారం అందుకున్నారు. అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ కల్చరల్ అవేర్నెస్ సొసైటీ, అర్పిత సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు కార్యాలయ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో ప్రతిభా పాటవాలు కలిగిన 26 మంది కళాకారులను జ్ఞాపికలు, పతకాలు, శాలువాలతో సన్మానించారు.

పీఆర్‌టీయూ అధ్యక్షుడికి సన్మానం

సుండుపల్లె, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా ఎంపికైన సూర్యుడునాయక్‌ను రాయవరం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన పాఠశాల సిబ్బందికి వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, సంఘ సభ్యులకు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలియజేశారు. నాగరాజు నాయక్, అమ్ము నాయక్ రాజశేఖర్, ఆది నారాయణ, పార్వతమ్మ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు!

● ఎత్తి వేయాలని సీపీఐ ధర్నా ● ఉప్పరపల్లి మహిళల వినతి



రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు, అక్టోబరు 21:(ఆంధ్రజ్యోతి) నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలను వెంటనే ఎత్తివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పందుగోల మణి, సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్, విద్యార్థి నాయకులు తుమ్మల కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. సోమవారం రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా విద్యార్థులు, కార్మిక సంఘాలు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడి, బడి లేని ప్రాంతాల్లో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చెబుతున్నా ఇక్కడి ఎక్సైజ్ సీఐ మొండి వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. మద్యం దుకాణాల ఏర్పాటు విషయంలో రైల్వేకోడూరులో ఎక్సైజ్ అధికారుల వింత పోకడలు ప్రదర్శిస్తున్నారని తెలిపారు. మద్యం వ్యాపారుల నుంచి ముడుపులు తీసుకోవడమే ఇందుకు కారణమని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మా గ్రామంలో మద్యం దుకాణం వద్దు

సిద్దవటం: తమ గ్రామంలో మద్యం షాపు వద్దని ఉప్పరపల్లె గ్రామ పంచాయతి సాయినగర్ మహిళలు సోమవారం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇళ్ల మధ్య మద్యం దుకాణంతో సమస్యలు వస్తాయని మహిళలు తెలియజేశారు. ఎక్సైజ్ సీఐ వారితో మాట్లాడుతూ మండలంలో 5 మద్యం దుకాణాలు ఉన్నాయని, నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉప్పరపల్లె సాయినగర్‌లో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నిబంధనలు పాటించాలి

రైల్వేకోడూరు(రూరల్): ప్రభుత్వ నిబంధనలతో మద్యం షాపును ఏర్పాటు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారి టి.తులసి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్ర సుత్తం మద్యం షాపులకు తాత్కాలిక లైసెన్స్ మాత్రమే మంజూరు చేశామని, పర్మనెంట్ లైసెన్స్ మంజూరు చేయాలంటే ప్రభుత్వ నిబంధనలకు లోబడే మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గుడి, బడికి 100 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండాలని లేని పక్షంలో లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. వారం రోజులలో పర్మనెంట్ దుకాణాలు ఏర్పాటు చేసు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దవటం: ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మహిళలు

'ఉపాధి' సిబ్బందిపై వేధింపులు ఆపాలి

రైల్వేకోడూరు, అక్టోబరు 21(ఆంధ్ర.జ్యోతి) ఉపాధిహామీ క్షేత్రసహాయకులపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, మండల కార్యదర్శి జాన్‌ప్రసాద్ కోరారు. సోమవారం రైల్వేకోడూరు సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం పని చేస్తున్న క్షేత్ర సహాయలకును తొలగించి తమ వారిని పెట్టుకోవాలని, కూటమి నాయకులు అధికారులపై వత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఉద్యోగం నుంచి తొలగించడం, కొత్త వారిని పెట్టుకోవడం, రాజకీయ వేధింపులకు గురి చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఎలాంటి అవినీతికి పాల్పడకపోయినా కె. బుడుగుంట పల్లెకు చెందిన చెందిన దళిత మహిళను తొలగించాలని కూటమి నాయకులు వత్తిడి తెస్తున్నారని తెలిపారు. ఉపాధి క్షేత్ర సహాయకుల తొలగింపు పర్వం ఆపకపోతే ఉద్యమాలు ఉగ్రరూపం దాలుస్తాయని హెచ్చరించారు.

అంగన్వాడీల్లో వసతుల కల్పన ప్రభుత్వ లక్ష్యం

సుండుపల్లె, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలో మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రాజమ్మ తెలిపారు. సోమవారం మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ నల్లగుట్టపల్లి అంగన్వాడీ కేంద్రం వద్ద చిన్నారుల కోసం మరుగుదొడ్డి నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించారు. సుండుపల్లె మండల వ్యాప్తంగా 13 అంగన్వాడీ కేంద్రాల వద్ద మరుగుదొడ్లు నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే 22 అంగన్వాడీ కేంద్రాలకు తాగునీటి వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం రూ.36 వేలు, తాగునీటి వసతికి రూ.17 వేలు అందిస్తుందని తెలిపారు. మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జయంతి, టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు ఆనంద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

సుండుపల్లె, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా కూలిపోయిన శివాలయం గోడ పునరుద్ధరణ యత్నాలను ఓ పోలీసు అధికారి అడ్డుకుంటున్నాడని మడితాడు గ్రామ పంచాయతీ వానరాచపల్లి బిడికి గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ ధైవాధీనంకు ఫిర్యాదు చేశారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయంలో కూలిపోయిన గోడను గ్రామపెద్దలు, యువకులు, విద్యార్థులు చేస్తున్న యత్నాలను పక్కనే ఉన్న భూమి యజమా అడ్డుకుం టున్నాడన్నారు. ఈ శివాలయం నిర్మించేటప్పుడు పక్కన భూమి కలిగిన రైతు ఎటువంటి అభ్యంతరం సృష్టించలేదు. ఆ రైతు తన భూమిని అమ్మేయగా, దానిని కొన్న ఓ పోలీసు అధికారి మరమ్మతులకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని వినతి పత్రంలో పేర్కొ న్నారు. ఈ విషయంపై మంగళవారం విచారణ చేస్తానని తహసీల్దార్ గ్రామస్తులకు తెలిపారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



అమరవీరులకు నివాళులర్పిస్తున్న కమాండెంట్ నాగేశ్వరప్ప, సిబ్బంది

సిద్దవటం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల త్యాగాలను మరువ లేనిదని 11వ ఏపీ ఎస్పీ బెటాలియన్ ఇన్‌చార్జి డి.నాగేశ్వరప్ప తెలిపారు. బెటాలియన్‌లో సోమవారం అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో 11వ ఏపీఎస్పీ బెటాలియన్‌కు చెందిన శామ్యూల్, రమేష్ అమరులయ్యారన్నారు. వారితోపాటు ఈ ఏడాది దేశవ్యాప్తంగా అమరులైన 216 మంది పోలీసు అమరవీరులకు జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు దియోపిలాస్, ఆర్‌ఐలు ఆలీబాషా, కేవీ రమణ, పీఆర్‌కే రాజు, టి.శ్రీనివాసరాజు, గోవిందరాజు, రేంజర్ కళావతి, బెటాలియన్ వైద్యాధికారి దివ్యారాణి, ఆర్‌ఎస్‌ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ నవీన్‌బాబు

రైల్వేకోడూరు, అక్టోబరు 21:(ఆంధ్రజ్యోతి) మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని రైల్వేకోడూరు ఎస్‌ఐ నవీన్‌బాబు తెలిపారు. సోమవారం రైల్వేకోడూరులోని వశిష్ట జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన వారోత్సవాల సందర్భంగా వివేకానంద యూత్ అసోసియేషన్, నెహ్రూ యువ కేంద్ర కడప ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రెడ్డేశ్వర్, సురేష్, కళాశాల సిబ్బంది, వివేకానంద యూత్ అసోషియేషన్ సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరబల్లి: నెహ్రూ యువకేంద్రం, వీఆర్‌డీఎస్ సంస్థ సంయుక్తంగా ఎస్‌డీకేఆర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో కళాశాల డైరెక్టర్ రవిశేఖర్‌రెడ్డి మాదక ద్రవ్యాలతో జరిగే నష్టాలను వివరించారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల ఆరోగ్యాలను నిర్వీర్యం చేస్తూ ఎంతో మంది జీవితాలు మధ్యస్థంగా ఆగిపోతున్నాయన్నారు. కొన్ని రకాల డ్రగ్స్ సమూలంగా నిర్మూలించడంలో యువత పోలీసులకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నాగయ్య, గీత, అంజలి, శ్రీను, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పయ్యరాజుపేటలో పారిశుద్ధ్య పనులు

పుల్లంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పయ్యరాజుపేట పంచాయతిలో సోమవారం రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. చెత్తను ఎత్తివేసి బ్లీచింగ్, సున్నం చల్లారు. పంచాయతి విస్తరణా ధికారి పెంచలయ్య, కార్యదర్శి ముత్తయ్య, ఉప సర్పంచ్ సయ్యద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

రాయచోటిటౌన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26, 27వ తేదీల్లో రాయచోటిలో నిర్వహించనున్న జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీ. శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబు, జగన్ సొంత ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను బీజేపీకి తాకట్టు పెట్టి, ప్రజా సమస్యలను గాలికొదిలేశారన్నారు. ఈ క్రమంలో ప్రజలను సమీకరించి పాలకుల వైఫల్యాలను ఎండగట్టి ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడానికి సీపీఎం ఈ నెల 26, 27 తేదీల్లో రాయచోటిలో జరిగే మహాసభలో జిల్లా సమగ్రాభివృద్ధి కార్యాచరణ రూపకల్పన చేయనున్నామని, ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీ. వెంకటేశ్వర్లు హాజరవుతున్నారని తెలిపారు. ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, వ్యాపారులు పెద్ద ఎత్తున హాజరై మహాసభల జయప్రదానికి ఆర్థిక సాయం చేసి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రామాంజులు, నాయకులు నాగబసిరెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ సభలపై విస్తృత ప్రచారం

రాయచోటిటౌన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నవంబర్ 5న విజయవాడలోనిఎంబీవీకే భవన్‌లో నిర్వహించనున్న పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. అంకన్న ఆధ్వర్యంలో సోమవారం రాయచోటిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పీడీఎస్‌యూ రాయచోటి నియోజకవర్గ నాయకులు ప్రసాద్, ముబారక్, రామాంజులు, కిరణ్, అరుణ్, సుబ్రమణ్యంరెడ్డి, శివశంకర్‌రెడ్డి, రాఘవ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

రాయచోటిటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థిని మృతిని నిరసిస్తూ సోమవారం దూదేకుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు మాసాపేటలోని వేంపల్లి రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణ వీధుల్లో కొనసాగింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ ర్యాలీలో దూదేకుల కుల సంఘాల ప్రతినిధులు, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి



అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నిధియాదేవి

రాజంపేట టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పరిష్కార వేదికలో ప్రజలు సమర్పించే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి సూచించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యల కోసం ప్రజలు అర్జీలు చేతపట్టుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లరాదన్నారు. ముందుగా మీ మండలంలోని అధికారులకు అర్జీలు ఇవ్వాలన్నారు. అక్కడ సమస్య పరిష్కారం కాకపోతే సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చి సమస్యను మా దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి.. కేసు నమోదు

సుండుపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాగంపల్లి గ్రామ పంచాయతీ కుంటలముందరకు చెందిన గోపి (43) మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీని వాసులు తెలిపారు. గ్రామాని కి చెందిన కొందరు తనను బెదిరిస్తున్నారని ఈ నెల 9న గోపి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, తమ మీద కేసు పెడతావా అంటూ వారు మళ్లీ బెదిరించడంతో పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అతని తల్లి భారతమ్మ ఫిర్యాదు మేరకు ు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పక్కాగృహాల నిర్మాణాలు పూర్తి చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్

పుల్లంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పక్కాగృహాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ మహేశ్వర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో పక్కాగృహాల నిర్మాణాలపై మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వంద రోజుల పక్కా ప్రణాళికల్లో భాగంగా నిలిచిపోయిన నిర్మాణాలను వెంటనే పూర్తి చేయించాలని సూచించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీడీవో జయశ్రీతో కలిసి అనంతసముద్రంలో ఇంటి పట్టాల లేఅవుట్‌ను పరిశీలించి లబ్దిదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ విజయ్‌కుమార్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.


కాళ్లరిగేలా తిరుగుతున్నా.. న్యాయం చేయండి

రైల్వేకోడూరు, అక్టోబరు 21:(ఆంధ్రజ్యోతి) 22 ఏళ్లుగా రైల్వేకోడూరు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తగిన న్యాయం జరగడం లేదని సుద్దరాయి మైన్స్ లీజు దారు గద్దలరేవుపల్లె కృష్ణంరాజు వాపోయాడు. మండలంలోని వీవీకంద్రిక సమీపంలో సుద్దరాయి గనుల మైనింగ్ లీజు విషయంలో నెలకొన్న సమస్యలపై . సోమవారం రైల్వేకోడూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దారు మహబూబ్ చాంద్‌కు ఈమేరకు విన్నవించుకున్నాడు. సమస్యను సాంతం విన్న తహసీల్దారు సంబంధిత పత్రాలన్నీ తీసుకువస్తే పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని సమాధానమిచ్చారు.

వీరభద్రుడి పల్లకి ఉత్సవం

రాయచోటిటౌన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకి ఉత్సవాన్ని నిర్వహించారు. ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి, వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకిపై ఆసీనులను చేసి ఆలయ మాడవీధుల్లో బ్యాండు మేళాలు, కోలాటాల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు, కర్ణాటక నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామ పంచాయతీ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సర్పంచులు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలనా వ్యవహారాల్లో సర్పంచులకు అధికారం ఇవ్వాలని సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు అన్నమయ్య జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు లక్ష్మినారాయణ తెలిపారు. గ్రామ సచివాలయాల సిబ్బందిని గ్రామ పంచాయతీకి అనుసంధానం చేసి, గ్రామ సర్పంచులకు బాధ్యతలు అప్పగించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం కార్యనిర్వహణ కార్యదర్శి పార్థసారథి రెడ్డి, సంయుక్త కార్యదర్శి పల్లపువాసు, ఉమ్మడి కడప జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు నాగార్జునచారి, చంద్రమ్మ, రెడ్డెయ్య, మల్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు

దారి ఇప్పించండి సారూ..

చిన్నమండెం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): తమ భూమికి దారి కల్పించాలంటూ మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీకి చెందిన పెద్దరాజన్న, వందన కలెక్టరుకు విన్నవించారు. కేశాపురం గ్రామ పంచాయతీలోని సర్వేనెంబర్ 1724/1లో 4,47 ఎకరాల భూమి దాదాపు 33 ఏళ్లుగా తమ అనుభవంలో ఉందని, ఆ భూమిలోకి వెళ్లే మార్గంలోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించారని ఫిర్యాదు చేశారు. తమకు రస్తా ఇప్పించి న్యాయం చేయాలని స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

సుండుపల్లె, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ నల్లగుట్టపల్లి సమీపంలోని యానాదికాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలంటూ గిరిజన సంఘ నాయకుడు అమ్మునాయక్ సోమవారం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలోని బోరు పాడైపోవడంతో వ్యవసాయ బావులను ఆశ్రయించాల్సి వస్తోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని ఎంపీడీవో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ప్రసాద్‌ను ఆదేశించారు.

శ్మశాన వాటికకు హద్దులు ఏర్పాటు

సుండుపల్లె, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): హిందువుల శ్మశాన వాటిక ఆక్రమణలకు గురవుతోందని మండల కేంద్రానికి చెందిన గుగ్గిళ్ల కృష్ణయ్య స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సర్వేయర్‌లు కీర్తన, జగదీష్, వీఆర్‌వో జయలక్ష్మి సోమవారం సర్వే నిర్వహించారు. శ్మశాన వాటిక స్థలానికి హద్దులు ఏర్పాటు చేశారు. వంకపోరంబోకు స్థలాన్ని గుర్తించారు. ఒక ఎకరా 64 సెంట్లు శ్మశాన వాటిక స్థలం ఉందని , దానిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల మహిళా నాయకురాలు రెడ్డిరాణి, రామకృష్ణారెడ్డి, బీసీ నాయకులు వెంకటేశ్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలి

గాలివీడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తుఫాను సమయంలో పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ టీ. భాస్కర్ హెచ్చరించారు. మండలంలోని తూముకుట నాయునివారిపల్లెలో ఆదివారం పిడుగుపడి 18 పొట్టేళ్లు మృతి చెందడంతోపాటు పశువుల కాపరి గాయపడడంతో సోమవారం ఆ గ్రామంలో పశువుల కాపరులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల కాపరులు పిడుగుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షం వచ్చేటప్పుడు పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు, పశువుల కాపరులు దగ్గరలో ఉన్న భవనంలోకి చేరుకోవాలన్నారు. చెట్లకిందకు ఎటువంటి పరిస్థితుల్లో వెళ్లకూడదన్నారు. కొండలు పర్వత ప్రాంతాల్లో ఉంటే వేగంగా దిగువకు వచ్చేయాలన్నారు. సెల్‌ఫోన్లలో సంభాషించరాదన్నారు. ఎత్తైన టవర్లు, విద్యుత్ స్థంభాలకు దూరంగా ఉండాలని సూచించారు.

అన్నమాచార్య యూనివర్సిటీలో నో ఐరన్ డే

రాజంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శక్తి పొదుపు లక్ష్యంతో స్థానిక అన్నమాచార్య యూనివర్శిటీలో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నో ఐరన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది ఐరన్ చేయని దుస్తులతో కళాశాలకు హాజరు అయ్యారు.

ముగిసిన పీసీబీ డిజైనింగ్, ఫ్యాబ్రికేషన్ వర్క్‌షాపు

ఈఈఈ విభాగం, చెన్నై స్టెమ్‌టెక్ సంస్థ ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న పీసీబీ డిజైనింగ్, ఫ్యాబ్రికేషన్ వర్క్‌షాపు సోమవారం ముగిసింది. ఈ వర్క్‌షాపుకు రిసోర్స్‌పర్సన్స్‌గా గోవిందరాజ్, తిరుమల జగన్ వ్యవహరించారు. కార్యక్రమాల్లో యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, ప్రోచాన్సలర్ చొప్పా అభిషేక్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ ఎస్.మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌ఎంవి నారాయణ, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.పద్మలలిత పాల్గొన్నారు.

ఇల్లు కబ్జా చేసిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

రాయచోటిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓ పేద మహిళకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిని కబ్జా చేసిన మున్సిపల్ ఉద్యోగి హరిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా నాయకుడు మావులూరి విశ్వనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన పట్టణ పరిధిలోని ఏజీ గార్డెన్‌లో బాధితులతో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ 2010లో షేక్. నసీబ్‌జాన్ పేరుతో అప్పటి ప్రభుత్వం ప్లాట్ కేటాయించడంతో , ఆ స్థలంలో ఆమె నిర్మాణం ప్రారంభించి గోడలు కూడా నిర్మించిందన్నారు. అనంతరం ఆర్థిక స్థోమత లేక నిర్మాణం పూర్తి చేయలేకపోయిందన్నారు. ఈ క్రమంలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న హరి నకిలీ డీ ఫారం చూపి, ఆ ఇల్లు తనదంటూ ఆక్రమించుకోవడంతోపాటు, తాము నిర్మించిన గోడలపై మోల్డింగ్ వేసుకున్నాడని, ఈ విషయం ప్రశ్నిస్తే చంపుతాం అంటూ బెదిరించాడన్నారు. ఈ విషయంపై బాధితురాలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రెండిళ్లలో చోరీ

● 45 తులాల బంగారు.. రూ.4 లక్షలు నగదు అపహరణ

రాయచోటి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోగి): తాళం వేసిన రెండిళ్లలో దొంగలు పడి భారీగా నగలు, నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని గుండి గున్నికుంట్ల రోడ్డులో నివాసముంటున్న ఉపాధ్యాయుడు రామ్మోహన్‌రెడ్డి కుటుంబం ఇంటికి తాళం వేసి పొరుగూరికి వెళ్లింది. సోమవారం రాత్రి ఆ ఇంట్లో దొంగలు పడి 45 తులాల బంగారం, రూ. 4 లక్షల నగదు అపహరించుకు వెళ్లారు. అదే విధంగా ఎస్‌ఎన్ కాలనీలోని వెంకటేశ్వర వీధిలో నివాసముంటున్న అశోక్ రెడ్డి ఇంట్లో రూ.20 వేలు చోరీ చేశారు. సోమవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చిన బాధితులు తాళాలు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై నరసింహారెడ్డి సంఘటనా స్థలాలను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పట్టణంలోని బండ్లపెంట ప్రాంతంలో అర్బన్ పోలీసులు దాడులు నిర్వహించి రెండు పొట్లాల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రేతలు పరారయ్యారు.

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం కడపలోని పోలీసు పెరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు అమరుల కుటుంబాలకు బహుమతులు అందజేస్తున్న జడ్జి, ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీ తదితరులు










ఏఎస్ఐ నాగార్జునరెడ్డి కుటుంబానికి బహుమతి అందచేస్తున్న ఆరవ అదనపు జడ్జి ఇంతియాజ్ అహ్మద్, ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటసుబ్బయ్య, అప్సర్ అహ్మద్ కుటుంబాలకు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ బి.నాగేశ్వరరావు, ఏఆర్ ఎస్ఐ డి.మల్లికార్జున, ఏఆర్ కానిస్టేబుళ్లు ఆర్.క్రిష్ణయ్య, విజయకుమార్, సురేష్ కుటుంబాలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం








ఎస్ఐ ఎస్‌డీ జాకీర్‌హుస్సేన్ కుటుంబానికి కుట్టుమిషన్, హెడ్ కానిస్టేబుల్ ఎన్‌వీ అమర్‌నాథ్ కుటుంబానికి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబానికి, ఏఆర్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు కుటుంబానికి, ఏఆర్ కానిస్టేబుల్ వేదవతి కుటుంబంలో చిన్నారికి సైకిల్, కానిస్టేబుల్ మల్లికార్జున కుటుంబానికి బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, తదితరులు

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సోమవారం రాయచోటి పోలీసు పెరేడ్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు అమరుల కుటుంబాలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపొద్దు

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

రాయచోటి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల ఫిర్యాదుల వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపరాదని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఆర్వో సత్యనారాయణరావు, ఆర్డీవో రంగస్వామి, ఎస్డీసీ రామసుబ్బయ్యలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందించిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంపై ప్రభుత్వం చాలా దృష్టి పెడుతోందని, సీఎం కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రీవెన్స్‌ను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో మండల, డివిజన్ ప్రధాన కేంద్రాల్లో కూడా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను పకడ్బందీగా నిర్వహించి చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి

● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



బాధితుల సమస్యలను తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజల నుంచి నేరుగా ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలపై ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదులను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యతనిస్తూ సత్వరమే సమగ్ర విచారణ జరిపి వారి సమస్యలను పరిష్కరిస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని వారు జిల్లాలోని ఆయా పోలీస్‌స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య



గంగులమ్మ (ఫైల్‌ఫొటో)

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనం, అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి గురైన మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లెలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, అమ్మ చెరువుమిట్టకు చెందిన గంగులమ్మ (48) నీరుగట్టు వారిపల్లెలో టమోటా మార్కెట్ యార్డులో దినసరి కూలీగా పనిచేస్తూ జీవిస్తోంది. తన కుమార్తె రమాకు వివాహం చేసింది. వారు విడిగా కాపురం ఉంటున్నారు. 30 ఏళ్ల క్రితం భర్త చనిపోయాడు. అనారోగ్యం, ఒంటరితనంతో జీవితంపై విరక్తి చెందిన ఆమె ఆదివారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందింది. సోమవారం ఉదయం తన కుమార్తె రమా ఇంటివద్దకు వెళ్లి చూడగా ఉరివేసుకున్నట్లు గుర్తించి కేకలు వేసింది. వెంటనే స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందజేయడంతో వారు మృతదేహాన్ని శవ పంచనామా కోసం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కురబలకోటకు చెందిన వాణి అనే మహిళపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడంతో పాటు రూ.3 లక్షలు డిమాండ్ చేసి ఇవ్వకుంటే చంపేస్తామంటూ బెదిరించిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె రూరల్ సీఐ రమేష్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కురబలకోటకు చెందిన వాణి అనే మహిళ చాలా మంది వద్ద డబ్బులు వసూలు చేస్తోందని, సోషల్ మీడియాలో సుజాతరాణి అనే మహిళ పోస్టులు చేస్తూ దుష్ప్రచారం చేసిందని, రూ.మూడు లక్షలు డిమాండ్ చేసిందని, లేకపోతే చంపేస్తామని బెదిరించినట్లు ముదివేడు పోలీసుస్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసింది. విచారించిన పోలీసులు సుజాతరాణితో పాటు సహకరించిన మదనపల్లెకు చెందిన నాగమణి, కురబలకోటకు చెందిన దేవ, తిరుపతికి చెందిన లక్ష్మీకళ అలియాస్ చంద్రకళలపై కేసు నమోదు చేశారు. కాగా సుజాత రాణి, దేవలు పాతనేరస్థులని సీఐ చెప్పారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

రామసముద్రం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని నడింపల్లె పంచాయతీ కమతంపల్లెలోని రాగిమాను రచ్చ వద్ద పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.8450 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుకను బొక్కేశారు..!



మల్లెల పంచాయతీ అంకిరెడ్డిపల్లె ఏటిలో డంపు చేసిన ఇసుక (ఫైల్ ఫొటో)



జెట్టివారిపల్లె సమీపంలో ఇసుకను అక్రమంగా డంప్ చేసిన దృశ్యం (ఫైల్ ఫొటో)

● జప్తు చేసిన ఇసుకపై కన్ను
● కోట్లు వెనకేసిన గత పాలకులు
● తప్పు చేసిన వారిపై చర్యలేవీ!
● ప్రత్యేక పోలీసు నిఘా ఉంచినా ప్రయోజనం నిల్
● రెవెన్యూ అధికారుల అండదండలే కారణమా?
● చర్యలు చేపట్టాలని ప్రజాప్రతినిధుల డిమాండ్

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇసుకను బొక్కేశారు. రూ.కోట్లు వెనకేసినా సంబంధిత అధికారులు అటువైపు చూడలేదంటే నమ్మశక్యం కాదు. పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమంగా తరలిస్తున్నా అటు పోలీసులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో యథేచ్ఛగా ఇసుకను తరలించుకుని సొమ్ము చేసుకున్నారు. కానీ అధికారులు మాత్రం వారిపై కేసులు నమోదు చేయలేదనే విమర్శలున్నాయి. గత వైసీపీ పాలనలో మండలంలోని మల్లెల గ్రామంలోని సంపతికోట ఏటిలో గత 2022వ సంవత్సరంలో స్థానిక ప్రజాప్రతినిధి ప్రోద్బలంతో స్థానిక బూర్లపల్లె సర్పంచ్ ఆ ఏటిలో రాత్రికి రాత్రే భారీ యంత్రాలను ఉపయోగించి ఇసుకను భారీగా డంప్ చేశారు. ఈ విషయంపై పలు పత్రికల్లో వార్తలు రావడంతో డంప్ చేసిన ఇసుకను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపేసి స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. గత ప్రభుత్వం అధికారంలో ఉండగా టి.సదుం పంచాయతీ రామాపురం ఇసుక రీచ్ నుంచి అక్రమంగా తరలించి సుమారు 10 వేల టిప్పర్ల ఇసుకను 2024 ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే మొత్తం ఇసుకను రాత్రికి రాత్రే టిప్పర్లతో కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకున్నట్లు చెబుతున్నారు.

భారీగా కర్ణాటకకు ఎగుమతి

టి.సదుం పంచాయతీలో చెన్నరాయునిపల్లె సమీపంలో ఉన్న పాపాఘ్నినదిలో ఇసుక డంప్‌ను అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసి ఇసుకను అక్రమంగా రెవెన్యూ అధికారుల అండదండలతో రాత్రికి రాత్రే లారీల ద్వారా గుట్టు చప్పుడు కాకుండా కర్ణాటక రాష్ట్రానికి తరలించి సొమ్ము చేసుకున్నారు. కనీసం గతంలో కర్ణాటక రాష్ట్రానికి ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డ ఇసుక లారీలను స్థానికులు పట్టించినా అధికారులు ఎమ్మెల్యే అండదండలతో ఆ లారీలను వదిలేసేవారని ఆరోపణలున్నాయి. దీంతో ఇసుక అక్రమ రవాణా గత ప్రభుత్వంలో అడ్డూ అదుపు లేకుండా పోయింది.

అధికారుల అండతో అమ్మేశారు

పెద్దతిప్పసముద్రం మండలం, మల్లెల గ్రామానికి సమీపంలోని అంకిరెడ్డిపల్లె, ఆవులరెడ్డిపల్లె సమీపంలో సంపతికోట ఏటి వాగు ఉంది. గత ప్రభుత్వ హయాంలో స్థానిక సర్పంచ్ నియోజకవర్గ ప్రజాప్రతినిధి, రాజంపేట పార్లమెంట్ ప్రజాప్రతినిధి అండదండలతో ఏటిలో మొత్తం ఇసుకను యంత్రాల సహాయంతో భారీగా డంప్ చేసినట్లు ఆరోపణలున్నాయి. దీనిపై స్థానిక నాయకులు అప్పట్లో లోకాయుక్తాకు సైతం ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన లోకాయుక్త ఆ ఇసుకపై ప్రత్యేక దృష్టి సారించి సీజ్ చేసిన ఇసుకపై తమకు నివేదికను అందించాలని కోరింది. అయితే లోకాయుక్తాను సైతం లెక్క చేయకుండా అప్పటి స్థానిక తహసీల్దార్ బూర్లపల్లె సర్పంచ్‌తో చేతులు కలిపి జప్తు చేసిన ఇసుకను పూర్తిగా అమ్మేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు.

జప్తు చేసిన ఇసుకపై స్థానికుల ఫిర్యాదు

గతంలో జప్తు చేసిన సుమారు 600 లోడ్లు ఇసుకను అమ్మేశారని బూర్లపల్లె గ్రామానికి చెందిన స్థానికులు రెవెన్యూ అధికారులకు, సబ్ కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేసినా ఇంతవరకు ప్రయోజనం లేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక వీఆర్వో, వీఆర్‌ఏల అండదండలతో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ అవసరాలకు ఇచ్చామంటూ పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం ఇప్పటికైనా జప్తు చేసిన ఇసుకను ప్రభుత్వ పనులకు వినియోగించారా లేక రెవెన్యూ అధికారుల అండదండలతో అమ్మేశారా అనే కోణంలో విచారణ చేపట్టి తప్పుచేసిన అధికారులపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే అనుమతులిచ్చాం

- విద్యాసాగర్, డిప్యూటీ తహసీల్దార్

మండలంలో అప్పట్లో ప్రభుత్వ భవనాలకు అధికారుల ఆదేశాల మేరకే ఇసుకను కేటాయించాం. మండలంలో ఎవ్వరికి అనుమతులు లేకుండా ఇవ్వలేదు. ప్రభుత్వ పనులకు మాత్రమే ఇచ్చాం. అక్రమంగా ఇసుకను తరలించే వారిపై చర్యలు తీసుకున్నాం.



టి.సదుం పంచాయతీ రామాపురం ఇసుక రీచ్‌లో డంప్ చేసిన ఇసుకను టిప్పర్లతో తరలిస్తున్న దృశ్యం (ఫైల్)



మల్లెల పంచాయతీ అంకిరెడ్డిపల్లె ఏటిలో ఇసుక డంప్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ పోలీసులు (ఫైల్)

హత్యకేసులో ముగ్గురు నిందితులు అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 21: (ఆంధ్రజ్యోతి): కురబలకోట డంపింగ్‌యార్డు వద్ద శనివారం జరిగిన హత్యకేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు తెలిపారు. సోమవారం స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. గత 14 ఏళ్లగా కురబలకోటకు చెందిన సులేమాన్ కువైత్‌లో డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. అతనికి ఉన్న పొలాలను చూసుకునేందుకు గానూ ఖాదర్‌బాషాను పనిలో పెట్టుకున్నాడు. ఇందుకు అతనికి నెలకు రూ.15 వేలు ఇచ్చేవాడు. అయితే సులేమాన్ ఇండియాలో లేని కారణంగా అతని భార్యకు హత్యకు గురైన ఖాదర్‌బాషకు అక్రమ సంబంధం ఉన్నట్లు గ్రామంలో పుకార్లు, షికార్లు చేశాయి. దీంతో సులేమాన్ 15 రోజుల క్రితం ఇండియాకు వచ్చాడు. తన పొలం పనులను చూసుకునేందుకు తన సమీప బంధువు కల్లూరు అబ్దుల్ రహీంను పనిలో పెట్టుకొని, ఖాదర్‌బాషను పనిలో నుంచి తొలగించాడు. దీంతో జీవనోపాధి కోల్పోవడంతో మృతుడు తీవ్ర ఆవేదన చెందాడు. ఈ నేపథ్యంలోనే అబ్దుల్ రహీంను, వారి కుటుంబ సభ్యులను మృతుడు కురబలకోట బస్టాండ్‌లో కించపర్చే విధంగా తిట్టాడని, బంధువర్గంలో పరువు మర్యాదలు కోల్పోతున్నామని భావించారు. ఈ క్రమంలో కురబలకోట మండలం, గడ్డంవీధికి చెందిన సులేమాన్, కోటవీధికి చెందిన అబ్దుల్ రహీంలు కుట్రపన్ని శుక్రవారం కురబలకోట గ్రామానికి చెందిన అరుణ్‌కుమార్‌తో కలిసి మద్యం సేవించి హత్యకు పన్నాగం పన్నారు.

శుక్రవారం రాత్రి 7.45 సమయంలో ఖాదర్‌బాష ఇంటి వద్ద కాపుకాశారు. మసీదుకు తన తండ్రి వెంట వెళుతున్న ఖాదర్‌బాషను మాట్లాడే పనిఉందని అబ్దుల్‌రహీం, అరుణ్ కుమార్‌లు వారి ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నారు. కురబలకోట డంపింగ్‌యార్డు వద్దకు తీసుకెళ్లి తాము తెచ్చుకున్న కత్తులతో గొంతుపై పొడిచి, అక్కడి నుంచి పారిపోయారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డురావడంతో కిందపడి ఇద్దరికి గాయాలయ్యాయి. కురబలకోట ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. సమాచారం తెలుసుకున్న మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు పర్యవేక్షణలో మదనపల్లె రూరల్ సీఐ రమేష్, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కురబలకోట మండలం, యర్రపల్లె పంచాయతీ, బాపనపల్లె వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని మదనపల్లె రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు చూపి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. వారు హత్యకు వాడిన రెండు కత్తులు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు 27 మంది ఎంపిక

కలికిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ మండలాల నుంచి జిల్లా స్థాయి పోటీల్లో 27 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 విభాగంలో సోమవారం మహల్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో 15 మంది బాలురు, 12 మంది బాలికలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ఉన్నత పాఠశాలలకు చెందిన బాలురు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. నవంబరు 6, 7 తేదీల్లో మొలకలచెరువు ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలు జరుగనున్నాయి.

బాలుర విభాగంలో

డి.లక్ష్మీనరసింహారెడ్డి, ఎం.హేమంత్, ఐ.భరత్, టి.దిలీప్, సి.చరణ్‌రాజ్, కె.పవన్, ఎన్.వెంకట్, యు.అఖిల్, కె.ఎస్.దర్శన్, జి.నాగమల్లేష్, వి.పార్థీవ్ రత్నం, ఎం.బాలాజీ, కె.రంజిత్, ఎస్.ఉమర్, పి.సతీష్, టి.హర్షవర్ధన్‌లు.

బాలికల విభాగంలో

ఇ.లక్ష్మి, బి.పూజిత, డి.శ్రీలక్ష్మి, ఎన్.లక్ష్మీప్రియ, ఎస్.వి.జూలీ, కె.నయనశ్రీ, ఎన్.తనుశ్రీ, జి.నీహారిక, ఎ.రేఖాశ్రీ, ఎన్.కల్పన, పి.యామిని, దేవీప్రియలు న్నారు. పోటీల నిర్వహణలో మహల్ హెచ్‌ఎం ఎస్.చెంగల్రాయులు, స్కూల్ కమిటీ అధ్యక్షుడు నిజాముద్దీన్, జిల్లా గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వసంతమ్మ, సహాయ కార్యదర్శి నాగరాజ, మహల్ పీడీ ఎస్.రియాజ్ అహ్మద్, మాజీ సర్పంచు టీడీపీ నాయకుడు మహ్మద్‌అలీ, జిల్లాలోని పలువురు సీనియర్ పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

కలకడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భూతగాదా విషయంలో వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మండలంలోని బాటవారిపల్లె పంచాయతీ పెమినేనివాండ్లపల్లెకు చెందిన వెంకటరమణ అదే గ్రామానికి చెందిన మల్లికార్జునకు కొంతకాలంగా భూతగాదాలున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న వెంకటరమణపై మల్లికార్జున్, వరుణ్‌లు గాయపరిచినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గాలేరు-నగరి ఈఈ శ్రీనివాసులుకు పదోన్నతి

కలికిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గాలేరు నగరి సుజల స్రవంతి కడప సర్కిల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేస్తున్న కె.శ్రీనివాసులుకు పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆయన సూపరింటెండెంట్ ఇంజినీరుగా పదోన్నతి పొందారు. శ్రీనివాసులును జల వనరులశాఖ కడప సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీరుగా నియమిస్తూ ఆ శాఖ ప్రత్యేక కార్యదర్శి జి.సాయి ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా టీవీ రమణ

కలికిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా కలికిరికి చెందిన టీవీ రమణను నియమించారు. ఈ మేరకు జాతీయ మాల మహానాడు మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.సి. కుసుమకుమారి సోమవారం రమణకు నియామకపత్రం అందజేశారు. గతంలో ఈయన జిల్లా కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఆయన సేవలను గుర్తించిన సంఘం జిల్లా పదవి అప్పగించింది. మాలల సంక్షేమం, అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తానని ఈ సందర్భంగా రమణ తెలియజేశారు.

కరోనా... ఏం మాయ చేసిందో..!

కొండాపురం రైల్వేస్టేషన్



- కళావిహీనంగా మారిన కొండాపురం రైల్వేస్టేషన్
- స్టాపింగ్‌కు నోచుకోని రైళ్లు
- గతంలో నడిచిన అన్ని రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలి
- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్
- ఆందోళనలు చేసినా.. పట్టించుకోని రైల్వేశాఖ

కొండాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మరి ఏం మాయ చేసిందో ఏమో కానీ కొండాపురం రైల్వేస్టేషన్ కళావిహీనంగా మారింది. బ్రిటీష్ కాలం నుంచి ఓ వెలుగు వెలిగిన ఈ రైల్వేస్టేషన్ ప్రస్తుతం వెలవెలబోతోంది. గతంలో ఈ స్టేషన్ మీదుగా వెళ్లే దాదాపు 80 శాతం రైళ్లకు స్టాపింగ్ ఉండేది. కరోనా మొదలైనప్పటి నుంచి



రైళ్లు నిలుపుదల చేయాలంటూ ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాలు (ఫైల్‌ఫొటో)

రెండు రైళ్లు మినహా అన్ని రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేశారు.ప్రస్తుతం దర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, తిరుపతి-హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మాత్రమే స్టాపింగ్ ఉంది. గతంలో కొండాపురం స్టేషన్‌లో స్టాపింగ్ ఉన్న అన్ని రైళ్లకు స్టాపింగ్ ఎత్తివేశారు.దీంతో కొండాపురంతో పాటు చుట్టు ప్రక్కల ఉన్న సింహాద్రిపురం, యల్లనూరు, తొండూరు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ రైళ్లు ఆగేదెప్పుడో...

కరోనా మహమ్మరి రాక ముందు హైదరాబాద్-తిరుపతి మధ్య నడిచే రాయలసీమ ఎక్స్‌ప్రెస్, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, చెన్నై-ముంబైల మధ్య నడిచే దాదర్ ఎక్స్‌ప్రెస్, మెయిల్ ఎక్స్‌ప్రెస్, కన్యాకుమారి-ముంబైల మధ్య నడిచే జయంతి ఎక్స్‌ప్రెస్‌లతో పాటు తిరుపతి-ముంబైల మధ్య నడిచే బాలాజీ ఎక్స్‌ప్రెస్‌లకు కొండాపురం రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఉండేది. వీటన్నంటిని పునరుద్ధరించాలని గతంలో వామపక్షాలు, ప్రజసంఘాలు ఆందోళన చేపట్టాయి. దీంతో కేవలం ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ను మాత్రమే ఆపుతున్నారు. అన్ని రైళ్లను పునరుద్ధరించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి గతంలో, ప్రస్తుతం కూడా లేఖ ఇచ్చారు. అయినా రైల్వేశాఖ నుంచి ఇంతవరకు స్పందన లేదు. వెంటనే అన్ని రైళ్లను పునరుద్దరించేలా ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

రైల్వే మంత్రిని కలిసినా...



కొండాపురంలో రైళ్ల స్టాపింగ్ కోసం గతంలో ఎంపీగా ఉన్న రఘురామకృష్ణమరాజుతో కలిసి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఢిల్లీలో రైల్వే మంత్రి అశ్వనివైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు తాను రైల్వేబోర్డులో పలుసార్లు అధికారులను కలిసినా ఇంతవరకు రైల్వే అధికారులు స్పందిచడం లేదు. ప్రయాణికుల సౌకర్యం చూడకుండా వారు ఏవేవో సాకులు చెబుతున్నారు. అయినప్పటికీ మరోసారి ఎమ్మెల్యేతో కలిసి రైల్వే అధికారులపై ఒత్తిడి తెచ్చి రైళ్లు ఆపేందుకు ప్రయత్నిస్తాం.

-దేవగుడి శివనారాయణరెడ్డి, మాజీ జడ్ఆర్‌యూసీసీ మెంబర్

అన్నిరైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలి



గతంలో స్టాపింగ్ ఉన్న రైళ్లకు కొండాపురంలో స్టాపింగ్ ఎత్తివేశారు.నాలుగు మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్న పట్టించుకోవడంలేదు. మేం గతంలో నిరాహార దీక్ష చేపట్టడానికి సిద్ధం కావడంతో కేవలం ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలును మాత్రమే ఆపుతున్నారు. గతంలో స్టాపింగ్ ఉన్న అన్ని రైళ్లకు తిరిగి కొండాపురం రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ఇవ్వాలి. లేకుంటే మరోసారి ఆందోళనకు దిగుతాం.

-ఎం.మనోహర్‌బాబు, సీపీఐ మండల కార్యదర్శి, కొండాపురం

కొండాపురం రైల్వేస్టేషన్‌లో తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు నీళ్లు నింపుతున్న దృశ్యం



నీళ్ల కోసం పేరెన్నిక గల స్టేషన్

గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో కొండాపురం రైల్వేస్టేషన్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. కర్నూలు జిల్లా మంత్రాలయం తర్వాత కొండాపురం రైల్వేస్టేషన్‌లోనే రైళ్లకు నీళ్లు నింపేవారు. మంత్రాలయం దగ్గరలో తుంగభద్ర నది నుంచి రైళ్లకు నీళ్లు నింపుతుండగా, కొండా పురం పక్కనే ఉన్న చిత్రావతి నది నుంచి రైళ్లకు నీళ్లు నింపేవారు. ఇందుకోసం చిత్రావతి నది నుంచి ప్రత్యేక పైపులైనును కొండాపురం రైల్వేస్టేషన్‌కు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు మాత్రమే కొండాపురంలో నీళ్లు నింపుతున్నారు. ప్రతిరోజు విశాఖపట్నం-కడప మధ్య నడిచే ఈ రైలు కొండాపురం రైల్వేస్టేషన్‌కు కేవలం నీళ్లు నింపుకోవడానికే కడప నుంచి కొండాపురం వస్తుంది. రైల్వేస్టేషన్‌లో సుమారు నాలుగు గంటలు హాల్టింగ్ ఉంటుంది. ఈ సమయంలో ఈ రైలుకు క్లీనింగ్ చేయడంతో పాటు నీళ్లు నింపుతారు. ఈ తర్వాత మధ్యాహ్నం ఒంటి గంటకు కొండాపురం నుంచి విశాఖపట్నం బయలుదేరుతుంది. కొండాపురం నుంచే ఈ రైలు మొదలవుతున్నా స్టేషన్‌లో ఈ రైలుకు టికెట్లు ఇవ్వకపోవడం గవనార్హం. దీనిపై స్థానికులు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి దృష్టికి తీసుకుకెళ్లగా.. ఇందుకు స్పందించి రైల్వే అధికారులతో ఫోన్లో మాట్లాడారు. వెంటనే ఇక్కడినుంచే స్టాపింగ్, టికెట్లు ఇచ్చి ప్రయాణీకులను ఎక్కించుకోవాలని కోరినా ఇంతవరకు స్పందన లేదు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు



గంగనపల్లెలో మొలకలు వచ్చిన మినుము కుప్పలను పరిశీలిస్తున్న ఏవో జయలక్ష్మి

కాశినాయన, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో వరి, మినుము, మిరప, ఉల్లి తదితర పంటలు దెబ్బతిన్నాయి. దీనిపై సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఎడతెరిపిలేని వర్షం... దెబ్బతిన్న పంటలు అనే శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం వివరాలను సమగ్రంగా పంపాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆమేరకు సోమవారం మండల వ్యవసాయాధికారి జయలక్ష్మి, విస్తరణాధికారి ధనలక్ష్మీ గంగనపల్లె, ఇటుకులపాడు తదితర గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్ట నివారణకు రైతులకు సూచనలు ఇవ్వడంతో పాటు జరిగిన పంట నష్టంపై రెండు రోజుల్లో జిల్లా అధికారులకు నివేదిక పంపుతామన్నారు.

ఏపీ డీజీపీని కలిసిన వేమన సతీష్



రాజంపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును తానా మాజీ అధ్యక్షుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్ విజయవాడ డీజీపీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్టంలో అవినీతి అక్రమాలపై, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు. ఇంకా పలు సమ స్యలపై ఆయనతో చర్చించారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా విజయకుమార్, మహేశ్‌బాబు




విజయకుమార్, మహేశ్‌బాబు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా విజయకుమార్, మహేశ్ బాబులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన స్వర్ణోత్సవాల సభ అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా నాగార్జునరెడ్డి, సహాయ అధ్యక్షుడిగా వై.రవికుమార్, సుజాతారాణి ట్రెజరర్‌గా కె.నరసింహారావు, కార్యదర్శులుగా శ్రీనివాసులు, డీవీ రవీంద్రుడు, చెన్నయ్య, సీవీ రమణ, ఎజాజ్ అహ్మద్, మురళీక్రిష్ణ, ఎల్.చంద్ర ఓబుల్‌రెడ్డి, ఎ.శ్రీనివాసులు, ప్రసన్నలక్ష్మి, టి.శివప్రసాద్‌లను ఎంపిక చేశారు.

పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడిగా క్రిష్ణప్రసాద్




ఎంవీక్రిష్ణప్రసాద్, రామాంజనేయరెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా ఎంవీ క్రిష్ణప్రసాద్, జిల్లా కార్యదర్శి రామాంజనేయరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటశివారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరం పీఆర్‌టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎగువగొట్టివీడు విద్యార్థులు

గాలివీడు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎగువ గొట్టివీడు హైస్కూల్ విద్యార్థులు కే.రెడ్డిప్రియ, పి.సునీల్‌కుమార్‌నాయుడులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామిరెడ్డి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడ రేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కడపలో ఈనెల 21వ తేదీ సోమవారం జరిగిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు కె.రెడ్డిప్రియ (10వ తరగతి) అండర్-17 విభాగంలో, పి. సునీల్ కుమార్ (7వ తరగతి) అండర్-14 విభా గంలో స్టాండ్ బైగా ఎంపికయ్యారన్నారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



పెండ్లిమర్రి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొలతల ఘాట్‌రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎ.మిథున్‌రెడ్డి (27) అనే యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకెళితే... మండలంలోని మాచునూరు పంచాయతీ కొత్తపేట గ్రామానికి చెందిన మిథున్‌రెడ్డి పొలతల క్షేత్రంలో దైవ దర్శనం ముగించుకొని ఇంటికి ద్విచక్రవాహనంపై వస్తుండగా ముందు వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ని ఓవర్ టేక్ చేసి ముందుకువెళ్లిన వెంటనే బైక్ అదుపు తప్పడంతో ట్రాక్టర్ కిందపడ్డాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

కడప క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎర్రముక్కపల్లిలోని కందిపాలెంలో సోమవారం ఓ వృద్ధుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఒన్‌టౌన్ సీఐ రామకృష్ణ తెలిపారు. కందిపాలెంకు చెందిన నంద్యాల కృష్ణ (62) బెల్దారి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. ఇంట్లో ఒంటరిగా ఉండేవాడు. సోమవారం మధ్యాహ్నం ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం కొరకు మృత్యదేహన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో దుండగులు..?

కడప క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కడప నగర అధ్యక్షుడు శివాకొండారెడ్డిపై దాడి చేసిన దుండగులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మూడు రోజుల క్రితం టీ తాగి ఇంటికి వెలుతున్న అయనపై యువకులు కర్రలతో కొట్టి ద్విచక్ర వాహనంలో పారిపోయారు. నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అదుపులో ఉన్న వారిలో ఒకరిపై రౌడీషీట్ ఉన్నట్లు తెలుస్తోంది. శివకొండారెడ్డిపై దాడికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంటుంది

హెయిర్ కటింగ్ సెలూన్లపై రాళ్లదాడి

రాయచోటిటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గల సెలూన్ షాప్‌లపై గుర్తు తెలియని దుండగులు రాళ్లతో దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు. రాయచోటి పట్టణంలోని చెక్‌పోస్టు సమీపంలో గల రవి హెయిర్ కటింగ్ సెలూన్‌కు చెందిన రవికిశోర్‌రెడ్డి, ప్రసాద్, తులసీ, ప్రసన్నకుమార్‌లు ఆదివారం రాత్రి మద్యం మత్తులో తమ వ్యాపారాలకు అడ్డుగా వస్తున్నారన్న కోపంతో చీఫ్ అండ్ బెస్ట్ సెలూన్ షాప్, టాయ్ అండ్ గాయ్ సెలూన్‌షాప్‌లపై వాహనంలో వెళ్లి రాళ్లదాడి చేసి అక్కడ నుంచి చల్లగా జారుకున్నారు. ఈ దాడిలో షాప్‌లోని అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని షాప్‌లోనే సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలియజేశారు.

దళితులపై అగ్రవర్ణాల దాడి.. ఎస్సీ ఎస్టీ కేసు

ఓబులవారిపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్లపల్లె కమ్మపల్లె హరిజనవాడ దళితులపై కాకర్లవారిపల్లెకు చెందిన అగ్రవర్ణాలవారు దాడికి పాల్పడటంతో ఎస్సీ ఎస్టీ యాక్టు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహే ష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను సొంతం చేసుకునేందుకు అగ్రవర్ణాలవారు ప్రయత్నించగా అడ్డుకోవడానికి వెళ్లిన దళితులపై దాడి చేసినట్లు తెలిపారు. పి.కమ్మపల్లె గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా.. అడ్డుకో వడానికి యత్నించిన హరిజవాడకు చెందిన పి.కృష్ణయ్య, మరో వ్యక్తిపై కర్రలతో దాడి చేశారు. కాగా వీరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. దాడికి పాల్పడిన కాకర్లవారిపల్లెకు చెందిన కస్తూరి వెంకటేశ్వర్ నాయుడు, శివయ్య నాయుడు, కోటయ్యనాయుడు, ఉమా, మరొకరిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

కడప(వినాయకనగర్), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు 2024-25కు సంబంధించి ఈ నెల 30వ తేదీ లోపు ఆయా కళాశాలల జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు దరఖాస్తులను సాంఘీక సంక్షేమశాఖ కడప వారికి ఆన్‌లైన్‌లో పంపాలన్నారు. కళాశాలలో చదువుతున్న ఎస్టీ విద్యార్థులందరూ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఐపీపీబీ ఖాతాను పోస్టాఫీసులో తెరవాలని కోరారు. పోస్టుమెన్ సహకారంతో ఆయా కళాశాలల్లో ఐపీపీబీ క్యాంపు నిర్వహించాలన్నారు. ఎస్టీ విద్యార్థులకు ఆధార్‌కార్డు, సెల్ నెంబర్ అవసరం ఉంటుందన్నారు. ఎన్‌పీసీఐ ద్వారా స్కాలర్‌షిప్‌లు నేరుగా అకౌంట్‌లో జమ అవుతాయన్నారు. నగదును తీసుకోవడానికి పోస్టాఫీసు ద్వారా కానీ, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా కానీ అవకాశం ఉంటుందని తెలిపారు.

జవాను రాజేశ్‌కు సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు



అంత్యక్రియల సందర్భంగా గాలిలోకి తుపాకీ పేల్చి జవానుల గౌరవవందనం

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్‌లోని నక్సల్స్ అమర్చిన ల్యాండ్‌మైన్ పేలి మృతి చెందిన జవాను కొడవటికంటి రాజేశ్‌కు సోమవారం ఆర్మీ సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జవాను రాజేశ్ ఇంటి నుంచి అంతిమయాత్ర ప్రారంభం కాగా.. దారి పొడవునా రాజేశ్ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. గ్రామ శ్మశానవాటిక వద్దకు చేరుకోగా.. రాజేశ్ భార్య స్వాతి. తల్లిదండ్రులు జానయ్య బాలమ్మ పలువురు కుటుంబసభ్యులు భౌతికకాయం వద్ద బోరున విలపించగా అందరూ కంటి తడిపెట్టారు. ఇండో టిబెటన్ బోర్డరు పోలీసులు, ఐటీబీపీఎస్ఎఫ్ సిబ్బంది అంత్యక్రియలకు హాజరై రాజేశ్‌ను కడసారి చూసి నివాళు ర్పిం చారు. అనంతరం గౌరవ వందనం చేసి సంతాపం సూచకంగా గాలిలో కాల్పులు జరిపి సైనిక లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకుముందు అడిషనల్ అసిస్టెంటు కమాం డెంట్ దితేంద్రసింగ్, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, బ్రహ్మంగారి మఠం ఎస్ఐ చంద్రశేఖర్, ఎంపీడీవో వెంగమునిరెడ్డి, తహ సీల్దారు దామోదర్‌రెడ్డి, బద్వేలు డివిజను ఆర్డీవో చంద్రమోహన్, గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని రాజేశ్‌కు నివాళులర్పించారు. రాజేశ్ భౌతికకా యానికి ఉదయం కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీమంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు వీరనారాయణరెడ్డి, టీడీపీ నేతలు యల్లటూరు సాంబశివారెడ్డి, మేకల సుధాకర్, చిలమల నాగయ్య, ఎస్ఆర్ శ్రీనివాసరెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, పూజా శివాయాదవ్ తదితరులు సంద ర్శించి రాజేశ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జన్ సురక్ష పథకాలపై అవగాహన పెంచాలి : కలెక్టర్



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీల్లో జన్ సురక్ష పథకాల (పీఎంజేబీబీవై, పీఎం ఎస్‌బీవై)పై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో ప్రత్యేక జిల్లాస్థాయి (డీఎల్ఆర్‌సీ) సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అన్ని బ్యాంకులకు నిర్ధేశించిన జన్‌సురక్ష పథకాలపై అవగాహన, అమలుపై బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి వచ్చే ఏడాది జనవరి 15 వరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో విస్తృత ప్రచారాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. బ్యాంకర్లు సమర్థవంతంగా పనిచేస్తేనే ఆర్థిక వ్యవస్థ మరింత ధృడంగా ఉంటుందన్నారు. జన్‌సురక్ష బీమా యోజన పథకాల నమోదు కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలన్నారు. ఈపథకా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు సంతృప్తిస్థాయిలో అర్థమయ్యేలా అవగాహన పెంచాలన్నారు. ప్రభుత్వాలు పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అన్ని రకాల బ్యాంకు రుణాలను అర్హులైన లబ్ధిదారులకు పెండింగ్ లేకుండా అందించాలని బ్యాంకర్లను ఆదేశించారు. సమావేశంలో లీడ్ బ్యాంకు చీఫ్ మేనేజరు జనార్ధన్, డీపీవో రాజ్యలక్ష్మీ, డీఆర్డీఏపీడీ ఆనంద్ నా యక్, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేసు విచారణ కోసం వచ్చిన వ్యక్తి మృతి

- స్టేషన్ ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన



స్టేషన్ ఎదుట దేవరాజు మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

సంబేపల్లె, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలం కొండావాండ్లపల్లికి చెందిన దేవరాజు (60) సోమవారం కేసు విచారణ కోసం వచ్చి ఒక్కసారిగా ఛాతి నొప్పి రావడంతో కుప్ప కూలి పడిపోయాడు. అతడిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిరాధరించారు. ఈ సంఘటనపై మృతుని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ సంబేపల్లె పోలీస్ స్టేషన్ ఎదుట మృతదేహంతో ఆందోళనకు దిగారు. రాయచోటి రూరల్ సీఐ సంఘటన విషయాన్ని తెలుసుకొని హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. దేవరాజు కుమార్తె జ్యోతి ఆడబిడ్డ అంజనమ్మ పోలీసు స్టేషన్‌లో బంగారు విషయంపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై విచారణకు పిలిపించినట్లు తెలిపారు. అతను హార్ట్ పేషెంట్ కావడంతో ఛాతి నొప్పి వచ్చినట్లు మృతుని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈ విషయంపై స్టేషన్‌లో జరిగిన విచారణ సంఘటనపై సీసీ ఫుటేజులను ఒకసారి పరిశీలించమని రూరల్ సీఐ వరప్రసాద్ మృతుని కుటుంబ సభ్యులను కోరారు. మృతుని కుటుంబ సభ్యులు ఆందోళన విరమించకపోవడంతో ఈ లోపే రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్ సంబేపల్లెకు చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడి సీసీ ఫుటేజీలను పరిశీలించాలని కోరారు. దీంతో కుటుంబ సభ్యులు సీసీ ఫుటేజిలను పరిశీలించి ఆందోళన విరమించారు. ఫిర్యాదు చేసిన వారి నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని.. తమకు ఏమి జరిగినా వారిదే బాధ్యత అని డీఎస్పీ ఎదుట మృతుని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ విషయంపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించి మృతదేహాన్ని తీసుకెళ్లారు.

ఛాతి నొప్పితోనే మృతి చెందాడు : డీఎస్పీ

సంబేపల్లె మండలం దుద్యాల గ్రామానికి చెందిన అంజనమ్మ బంగారు విషయంపై ఫిర్యాదు మేరకు దేవరాజును స్టేషన్‌కు పిలిపించారు. అతడికి ఛాతినొప్పి రావడంతో రాయచోటి ఆసుపత్రికి తరలించగా.. గుండె నొప్పితో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. స్టేషన్‌లో జరిగిన సీసీ ఫుటేజి మృతుని కుటుంబ సభ్యులకు చూపించడంతో వారు శాంతించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లారని డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు.

హుండీ ద్వారా రౌద్రాల అంకాళమ్మకు రూ.98 వేలు ఆదాయం



హుండీ లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

పీలేరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల సందర్భంగా పీలేరు రౌద్రాల అంకాళమ్మ ఆలయానికి హుండీ ద్వారా రూ.98,500లు ఆదాయం వచ్చినట్లు జిల్లా దేవదాయ శాఖాధికారి విశ్వనాథ్ తెలిపారు. ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె ఇన్‌స్పెక్టరు శశి, ఆలయ పూజారి ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఖవ్వాలి పోటీలు

ములకలచెరువు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీ మహల్ వద్ద వెలసిన హజరత్ మహబూబె సుబహాని ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన ఖవ్వాలి పోటీలు ఆకట్టుకున్నాయి. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌కు చెందిన నిజాం నవాజ్ ఖాద్రి, బెంగళూరుకు చెందిన పర్వీన్ సుల్తానా బృందాల మధ్య ఖవ్వాలి పోటీ జరిగింది. అలాగే ఉరుసుకు జనం పోటెత్తారు. దర్గాలో కులమతాలకతీతంగా హిందూ, ముస్లీంలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో దర్గా కమిటీ అధ్యక్షుడు అగ్రహారం కాలేషా, కమిటీ సభ్యులు సునీల్‌బాషా, జహీర్, ఆటో రఫీ, మెకానిక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వినికిడి పరికరాల కోసం పరీక్షలు



వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మదనపల్లె అర్బన్, అక్టోబరు21:(ఆంధ్రజ్యోతి) స్థానిక సర్వజన బోధనాస్పత్రిలో సోమవారం చెవి వినికిడి పరికరాల కోసం వైద్యులు పరీక్షలు నిర్వహించారు. దీనదయాల్ శ్రావణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినికిడి పరీక్షలు నిర్వహించినట్లు ఎన్‌జీవో ఆఫీసర్ రవితేజా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు పరీక్షలు చేసి వినికిడిని నమోదు చేసి పరికరాల కోసం పంపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎంఎస్‌రాజు, సర్వజన బోధనాస్పత్రి ప్రిన్సిపాల్ జమున, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, అన్నమయ్య ఆర్‌బీకేఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శివప్రతాప్, డాక్టర్ దీప్తి, డీఈఐసీ సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముదివేడు నిర్వాసితులకు పరిహారం అందించాలి

మదనపల్లె టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌తో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నిర్వాసితులకు ఇళ్ల స్థలాలతో పాటు రూ.25లక్షలు పరిహారం చెల్లించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హరిశర్మ, ప్రభాకర్‌రెడ్డి, నిర్వాసితులు శంకర్‌రెడ్డి, శ్రీనివాసులు, సురేంద్రరెడ్డి, సురేష్, ప్రభాకర్, తిరుమల, అమరావతి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

నా భార్య ఆచూకీ తెలపండి

పెద్దమండ్యం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలంలోని కలిచెర్లలో నివాసం ఉంటున్న సైషావలి తన భార్య ఆచూకీ తెలపాలంటూ పోలీసులను ఆశ్రయించాడు. బెంగుళూరు కు చెందిన హీనాతో 2017లో సైషావలికి వివాహమైంది. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. అయితే గత నెల 29వ తేదీ రాత్రి నుంచి భార్య హీనా(26) కనబడలేదని, ఆమె కోసం పలుచోట్ల బంధువులు, తెలిసిన వారందరి అడిగిన అచూకీ తెలియక పోవడంతో సోమవారం పెద్దమండ్యం అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పీవీ రమణ తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



తుపాకుల చెరువు వద్ద ఉన్న పురాతన ఆంజనేయస్వామి ఆలయం

● పురాతన ఆలయం వద్ద లోతుగా తవ్విన గుంత

గుర్రంకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండలో గుప్త నిధుల ముఠా సభ్యులు పురాతన ఆంజనేయస్వామి ఆలయాన్ని ధ్వంసం చేశారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గుర్రంకొండ పట్టణానికి కూత వేటు దూరంలో తుపాకులచెరువు ఉంది. ఈ చెరువు కింద ఆయకట్టు పొలాల్లో పురాతన ఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయం నేడు దూపదీపాలకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఆలయంలో గుప్త నిధులు ఉంటాయనే భావనతో నాలుగు రోజుల క్రితం కొందరు ముఠా సభ్యులు బయట రాష్ట్రాల నుంచి మాంత్రికులను పిలిపించి పూజలను చేయించారు. గుప్త నిధుల కోసం ఎక్స్‌కవేటర్‌తో ఆలయం ముందున్న మండపానికి ఓవైపు సుమారు 20 అడుగుల లోతు గుంతను తవ్వారు. ఈ తతంగమంతా పగటి పూట చేయడంతో పక్క పొలాల రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో పోలీసులు అక్కడకు చేరుకునేలోపే గుప్త నిధుల ముఠా సభ్యులు పరారయ్యారు. ఈ ముఠా సభ్యుల్లో కొందరు స్థానికులున్నట్లు తెలియడంతో పోలీసులు వారిని విచారిస్తునట్లు సమాచారం. ఈ విషయమై ఎస్ఐ మధురామచంద్రుడు వివరణ కోరగా ముఠా సభ్యుల వివరాలను సేకరిస్తునట్లు తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.



ఆలయం పక్కనే గుప్త నిధుల కోసం తవ్విన గుంత

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహించాలి

రామసముద్రం, అక్టోబరు 21(ఆంధ్ర జ్యోతి): దళితుల సమస్యల పరిష్కా రానికి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమా వేశాలు నిర్దేశించిన సమయాలలో క్రమం తప్ప కుండా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్పీ నాయకులు స్థానిక తహసీ ల్దార్ నిర్మలాదేవిని కోరారు. జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్య క్షుడు రాజేష్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు సుధాకర్‌తో కలిసి ఎమ్మార్పీ ఎస్, ఎమ్మెస్పీ నాయకులు సోమవారం రామసముద్రం తహసీల్దార్‌ను కలిసి ప్రతి నెలా ఎస్సీ కాలనీలలో ఎస్సీ, ఎస్టీ మానిటరిం గ్ సమావేశాన్ని నిర్వహించాలని కోరారు. అలాగే ఎంపీడీవో భానుప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మండలంలో ఆరోగ్యకరమైన నీటిని అందించాలని, శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంక్‌లను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు సుధాకర్, ఎమ్మార్పీఎస్ గౌరవాధ్యక్షుడు అయ్యప్ప, వీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు విశ్వనాథ్, ప్రచార కమిటీ అధ్యక్షుడు వాసు, ఎంఈఎఫ్ అధ్యక్షుడు భాస్కర్, యువసేన అధ్యక్షులు లక్ష్మీప తి, అశోక్, గంగాధర్, మణి, శంకర్ బన్ని, మనోహర్, శివ, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలి

కలకడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించి చదువుతున్న పాఠశాలకు గుర్తింపు తేవాలని కోన హైస్కూల్ హెచ్ఎం చెంగల్‌రాయులు కోరారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీ ల్లో విజేత నిలిచి బంగారు పతకం సాధించ డంతో ఉమ్మడి చిత్తూరు జట్టు సభ్యులైన పాఠ శాల విద్యార్థులు, పీడీ ఝాన్సీరాణిని ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. ఈ సందర్భం గా హెచ్ఎం మాట్లాడుతూ 20 మంది సభ్యులున్న జట్టు తమ పాఠశాల నుంచి ప్రాతినిధ్యం వహించి విద్యార్థులు, సమీర్‌ఖాన్, గణేష్‌రాయల్, షారూక్‌ఖాన్, యోగేష్, మునికిరణ్, జితేంద్ర, శివతేజ సత్తాచూపి కప్పు సాధించిడంలో కీలక పాత్రపోషించారన్నారు.

రీసర్వే గ్రామాలలో గ్రామసభలు

బి.కొత్తకోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలంలో రీసర్వే పూర్తి అయిన గ్రామాలలో మంగళవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నారు. కోటావూరు, గోళ్లపల్లె, తుమ్మనంగుట్ట, గుమ్మసముద్రం రెవిన్యూ గ్రామాలలో రీసర్వేలో ఫిర్యాదులు, ఆక్షేపణలు ఉంటే రైతులు అధికార బృందానికి లిఖితపూర్వకంగా ఇవ్వవచ్చని ఇన్‌చార్జి తహశీల్దార్ మహమ్మద్‌అన్సారీ పేర్కొన్నారు. మంగళవారం కోటావూరు గ్రామంలో గ్రామసభ జరుగుతుందని, ఆ ప్రాంతరైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నిమ్మనపల్లిలో: గత ప్రభుత్వంలో రీసర్వే జరిగిన గ్రామాలలో 24నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ధనంజేయులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ తంలో జరిగిన రీసర్వే ద్వారా పట్టాదారు పాసు పుస్తకాలలో ఉన్న సర్వే నెంబర్లలో భూమి కంటే ఎక్కువ, తక్కువగా నమోదు జరిగాయని దీంతో సర్వే జరిగిన తవళం, అగ్రహారం, నిమ్మనపల్లి, చౌకిళ్లవారిపల్లి, సామకోటవారిపల్లి గ్రామాలలో ఈనెల 24నుంచి 30వతేదీ వరకు గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు.

పీటీఎంలో అలరించిన కోలాటం

పెద్దతిప్పసముద్రం అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పీటీఎంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కడప జిల్లా బ్రహ్మంగారి మఠం విరజానంద కోలాట బృందంచే కోలాటోత్సవం అలరించింది. ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం రాత్రి 7గంటల నుంచి కోలాట కళాబృందం వారిచే కోలాటలను అత్యంత వైభవంగా వేశారు. ఈకోలాటలను తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తిలకించారు. హజరైన వారికి అన్నదానం చేశారు.

లక్ష్యానికి మించి సభ్యత్వ నమోదు చేయాలి

● పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ అధిష్ఠానం అందించిన లక్ష్యానికి మించి చేయాలని పీలేరు నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ నెల 26 నుంచి జరగనున్న సభ్యత్వ నమోదు ప్రక్రియ సన్నాహకంగా సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడే పీలేరు నియోజకవర్గంలో కుప్పంతో పోటీపడేలా సభ్యత్వ నమోదు చేయించామని, అధికారంలో ఉన్న ప్రస్తుత తరుణంలో ఆ స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. రూ.100లు చెల్లించి సభ్యత్వం తీసుకునే ప్రతి ఒక్కరికీ రూ.5 లక్షల ప్రమాద బీమా సదుపాయం ఉంటుందన్నారు. అనంతరం సభ్యత్వ నమోదుపై మండలాల వారీగా సమీక్షించారు. నాయకులు శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి, కోటపల్లె బాబు రెడ్డి, మల్లెల రెడ్డిబాషా, పురం రామ్మూర్తి, యల్లెల రెడ్డప్ప రెడ్డి, కంచి నూరి, రహంతుల్లా, వసంతాల రాజా, మల్లిఖార్జున రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలకు గుర్తింపు ఇవ్వాలి



సబ్‌కలెక్టరేట్ ఎదుట రాస్తారోకో చేస్తున్న బీఎస్పీ నాయకులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) మదనపల్లెకు మంజూరైన ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఎన్ఎంసీ గుర్తింపు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ ఎదుట జాతీయ రహదారిపై బీఎస్పీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ మదనపల్లె మండలం ఆరోగ్యవరం వద్ద ఇప్పటికే 50శాతం మెడికల్ కళాశాల భవనాలు సిద్ధం అయ్యాయని, సర్వజన బోధనాస్పత్రికి 70శాతం బోధన సిబ్బంది నియమించారన్నారు. ఈ మెడికల్ కళాశాలకు ఎన్ఎంసీ గుర్తింపుపై ప్రభుత్వం పునరాలోచించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

అంగన్‌వాడీ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

పెద్దమండ్యం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలలో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ. 5.64లక్షలు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రెడ్డప్ప వెల్లడించారు. సోమవారం డీఈ పర్యటించి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ. 3లక్షల 60 వేలు నిధులు మంజూరు కాగా తాగునీటి సౌకర్యం కోసం రూ. 2లక్షల 4వేలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. వీటి నిర్మాణాల కోసం ప్రణాళిక సిద్ధం చేయాలని డీఈ ఆదేశించారు. ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్, ఇంజనీరు అసిస్టెంట్ పవన్‌కుమార్, సహాయకుడు నరసింగరావు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాల వద్ద జాగ్రత్తలు పాటించాలి



బాణసంచా దుకాణాల ఏర్పాటుపై సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్‌లో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక బాణసంచా దుకాణాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో పోలీసు, రెవెన్యూ, విద్యుత్, ఫైర్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ నివాస ప్రాంతాలకు, పెట్రోల్ బంకులకు దూరంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లైసెన్సులు పొందిన వారు మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీఎస్పీ కొండయ్య నాయుడు మాట్లాడుతూ దుకాణాలు ఏర్పాటు చేసే మైదానానికి రెండు ప్రవేశమార్గాలు ఉండేలా చూసుకోవాలన్నారు. ఫైర్ ఆఫీసర్ శివన్న మాట్లాడుతూ దుకాణాల మధ్య మూడు మీటర్ల దూరం పాటించాలని, రెండు అగ్నిమాపక నిరోధక పరికరాలు ఏర్పాటు చేసుకోవాల న్నారు. ప్రతి దుకాణం వద్ద 200 లీటర్ల నీరు నిల్వ ఉండేలా డ్రమ్ములు ఏర్పాటు చేసుకోవాల న్నారు. ఎస్పీడీసీఎల్ ఏఈ చంద్రమౌళి మాట్లాడుతూ బాణసంచా దుకాణాల వద్ద విద్యుత్ తీగలు షార్టుసర్క్యూట్ లేకుండా ఇన్సులేషన్ చేయించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్‌లు నిర్మలాదేవి, ధనంజేయులు, సీఐలు చాంద్‌బాషా, రామచం ద్ర, రాజారెడ్డి, రాజారమేష్, ఖాజాబీ, బాణసంచా దుకాణదారులు పాల్గొన్నారు.

నివాసాల మధ్య మద్యం దుకాణాల ఏర్పాటు వద్దు

● సబ్‌కలెక్టర్‌కు అర్జీల వెల్లువ

మదనపల్లె టౌన్, అక్టోబరు 21(ఆంధ్ర జ్యోతి): మదనపల్లె పట్టణంలో కొన్ని చోట్ల నివాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పా టు చేశారని వాటిని అక్కడ నుంచి తొలగిం చాలని ప్రజలు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ కు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో 93 మంది అర్జీలు అందజేశారు. ఈ సంద ర్భంగా బాపూజి పార్కు ప్రాంతవాసులు మా ట్లాడుతూ గతంలో కూడా బాపూజీ పార్కు ఎదుట మద్యం దుకాణం ఏర్పాటు చేసినప్పుడు తమ ఫిర్యాదు మేరకు అప్పటి సబ్‌కలెక్టర్ అక్కడ మద్యం దుకాణాన్ని నిరాకరించారన్నారు. కాని ప్రస్తుతం మళ్లీ మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వలన మహిళలు, చిన్నపిల్లలు మద్యం బాబులతో వేగలేకపోతున్నామన్నారు. క్షేత్రస్థాయి పరిశీలించి ప్రజలకు న్యాయం చేయాలని కోరా రు. సబ్‌కలెక్టరేట్ ఆవరణలోని చింత చెట్టు కూలి తమ తండ్రి చంద్రశేఖర్ రెండు కాళ్లు విరిగి పోయాయని, పేదలైన తమకు మెరుగైన చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించాలని భార్గవి సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ కాశీరావుపేట వద్ద అన్నదాన సత్రంకు గతంలో స్థలం కేటాయించారని, ఇప్పుడు ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేస్తున్నా రని రైతు కృష్ణమూర్తి ఫిర్యాదు చేశాడు. తన భూమిని ఆక్రమించుకుని తనపైనే దౌర్జన్యం చేస్తున్నారని కురబలకోట మండలం కృష్ణారెడ్డిగారిపల్లెకు చెందిన కృష్ణప్ప ఫిర్యాదు చేశాడు. ప్రతి అర్జీదారుడి సమస్యను తెలుసుకున్న సబ్‌కలెక్టర్ సంబంధిత అధికారులకు రెఫర్ చేశారు. విచారించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

మదనపల్లె సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం



మదనపల్లె మండలంలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నియోజకవర్గం సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మదనపల్లె మండలం సీటీఎం గ్రామం నుంచి వేంపల్లె గ్రామం వరకు మొత్తం 65 సీసీ రోడ్ల పనులను రూ.4.05 కోట్ల అంచనాతో ఎమ్మెల్యే భూమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ మదనపల్లె నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.6కోట్లు మంజూరు చేసిందన్నారు. మారుమూల గ్రామల్లో కూడా ప్రజలు ఇబ్బం దులు పడకుండా సీసీ రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో మస్తాన్‌వలి, ఏపీవో సుబ్రమణ్యం, పీఆర్ ఏఈ రమణ, టీడీపీ నాయకుడు విద్యాసాగర్, బీజేపీ నాయకుడు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలలతో పని చేయించడం నేరం

పీలేరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బాల లను పనిలో పెట్టుకోవడం నేరమని, అలా పనిచేయిస్తున్న వారికి కఠిన శిక్షలు ఉం టాయని పీలేరు సహాయ కార్మిక శాఖా ధికారి ఆనందబాబు పేర్కొన్నారు. 'ఆపరేష న్ స్వేచ్ఛ' పేరుతో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకై సోమవారం ఆయన స్వచ్ఛంద సేవా సంస్థలు, పోలీసులు, విద్యాశాఖాధికా రులతో కలిసి పీలేరులో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకార్మిక నిర్మూలన, ఇప్పటికే ఆ వ్యవస్థలో ఉన్న వారికి పునరావాసం కల్పించేందుకు ఈ నెల 5 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే అవకాశం ఉన్న అన్ని రంగాల్లోని వారికి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో లోకేశ్వర రెడ్డి, ఏఎస్ఐ నాగప్ప నాయక్, గ్రేట్ విజన్ సొసైటీ సంస్థ అధ్యక్షులు జీవీఎస్ బాబు, సీఆర్‌పీ మురళీధర్ రాజు పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి చేశారంటూ ఫిర్యాదు

పీలేరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తనపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్లు పీలేరు పట్టణం రాజీవ్ నగర్ కాలనీకి చెందిన హరినాథ్ అనే ఆటోడ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోటారు సైకిల్‌పై వెనుక నుంచి వచ్చిన ఇద్దరు యువకులు మద్యం మత్తులో విచాక్షణారహితంగా ఇనుప రాడ్లతో దాడి చేశారని దీంతో తన, కుడి కన్ను, కుడి చెవి దెబ్బతిన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. చికిత్స కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు విచారిస్తున్నారు.

బెల్ట్‌షాపు పై దాడి - 137 మద్యం బాటిళ్లు స్వాధీనం

పెద్దమండ్యం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలం కోటకాడపల్లి గ్రామ పంచాయతీ చెరువుకిందపల్లి సమీపంలో సోమవారం సాయంత్రం అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ బెల్ట్‌షాపుపై పోలీసులు దాడి చేశారు. 137 మద్యం బాటిళ్ల ను స్వాధీనం చేసుకోని సుదర్శన్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. అసాంఘీక కార్యాకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

రైతులకు బస్సు సౌకర్యం కల్పిస్తాం

మదనపల్లె టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మదనపల్లె రైతుబజార్‌కు వచ్చే రైతుల ఉత్పత్తుల తరలింపునకు బస్సు సౌకర్యం కల్పిస్తామని మార్కెటింగ్‌శాఖ ఏడీఎం త్యాగరాజు పేర్కొన్నారు. సోమవారం రాత్రి మదననపల్లె మండలం ఉప్పరవాండ్లపల్లె, భూమకవారిపల్లెలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఎం మాట్లాడుతూ రైతు బజార్‌లో అన్ని సౌకర్యాలు కల్పించామని, రైతుల ఉత్పత్తులకు ఎలాంటి రుసం వసూలు చేయరన్నారు. ప్రతి రోజు సీటీఎం నుంచి మదనపల్లె రైతు బజార్‌కు కూరగాయాలు తీసుకువచ్చే రైతుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతివనం ప్రసాద్, కృష్ణప్ప, ఏఎంసీ సెక్రటరి జగదీష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

24న జిల్లా డీలర్ల సమావేశం

మదనపల్లె అర్బన్, అక్టోబరు21:(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ రోడ్డులోని జేసీఎం కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 24న జిల్లా డీలర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ బి. గోపాల్‌రెడ్డి, మదనపల్లె అర్బన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. ఈ సమావేశంలో డీలర్ల సమస్యల పరిష్కారంపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి స్టేట్ డీలర్ల అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షుడు డీవీ లీలామాధవరావు, సివిల్ సప్లై కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పర్వీన్‌తాజ్ పాల్గొననున్నారని డీలర్లు అందరూ పాల్గొనాలని కోరారు.

ఉపాధి హామీ ఏపీడీగా శ్రీనివాసులు

కలికిరి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కలికిరి డ్వామా ఉపాధి హామీ క్లస్టర్ ఏపీడీగా ఎన్. శ్రీనివాసులును నియమించారు. ఈ మేరకు అయన సోమవారం సీఎల్ఆర్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఎల్‌డీవోగా పనిచేస్తూ క్లస్టర్ ఏపీడీగా బదిలీ అయ్యారు. అనంతరం ఉపాధి ఏపీవోలు, ఈసీలతో సమావేశమయ్యారు. కలికిరి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం ఏపీవోలు, ఈసీలు పాల్గొన్నారు.